

కరకగూడెం మర్కొడు మధ్య పెద్దగుట్టపై కలెక్టర్ జితేష్ వి పాటిల్, గతంలో ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో పోలీసులు

సాహస'జితేషుడు'

- కారడవిలో కలెక్టర్ జితేష్ ప్రయాణం
- మావోల ప్రభావిత ప్రాంతంలో రెండు గంటల పర్యటన
- రహదారి నిర్మాణం చేపట్టాలన్న లక్ష్యంతోనే..

7

ఉమ్మడి జిల్లా రైతుల చూపు.. ప్రస్తుతం ఆయిల్‌పామ్ వైపు మళ్లుతోంది. మిర్చి, పత్తి, వరి వంటి వాణిజ్య, ఆహార పంటల సాగులో ముందున్న జిల్లాలో.. ఇప్పుడు ఆయిల్‌పామ్ విస్తరిస్తోంది. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి నష్టాలు, కష్టాలు చూస్తున్న జిల్లా రైతులు.. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్న రైతుల దృష్టి ఆయిల్‌పామ్ సాగుపై పడింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దశాబ్దన్నర కాలంగా ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పామ్‌కు ఉన్న భవిష్యత్, ప్రత్యామ్నాయ పంటల సాగుగా అయిల్ పామ్ వేయాలని చెబుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాల్లోనూ, రైతుల సభలు, సమావేశాల్లోనూ.. చివరకు ప్రైవేటు కార్యక్రమాలకు వెళ్లినప్పుడు కూడా ఆయిల్‌పామ్ పంట లాభాల గురించి, పంట విశిష్ఠత గురించి చెబుతుండడంతో.. అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఇటు ఖమ్మం జిల్లాలో కూడా సాగు విస్తరిస్తోంది. మొదటినుంచి ఉమ్మడి జిల్లాలో మిర్చి, పత్తి, వరి సాగు అధికంగా ఉంది. ఒకప్పుడు కంది, పెసర, మినుము, జొన్న వంటి పప్పుదినుసులు, ఆహారపంటల సాగుకు ప్రసిద్ధి. ఆ తర్వాత సాగర్ కాలువ నిర్మాణంతో వరిసాగు పైనా, ఆ తర్వాత, మిర్చి, పత్తి సాగుపై దృష్టిపెట్టి రాష్ట్రంలోనే ఈ పంటల సాగులో ప్రత్యేకత సాధించిన జిల్లాగా నిలిచింది.



పామాయిల్ తోట

రైతుల చూపు పామాయిల్ వైపు

- జిల్లాలో విస్తరిస్తున్న ఆయిల్ పామ్
- ప్రత్యామ్నాయంపై దృష్టి సారిస్తున్న అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు
- రెండు చోట్ల పరిశ్రమలు.. త్వరలోనే మరికొన్ని ఏర్పాటు
- మంత్రి తుమ్మల స్ఫూర్తితో ఆయిల్‌పామ్ వైపు అడుగులు
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్

ఖమ్మం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఖమ్మం జిల్లా పరిధిలో ఒకప్పుడు వందల ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్ సాగు ఇప్పుడు 40వేల ఎకరాలకు చేరింది. ఈ ఏడాది 6700ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ పంటలు వేశారు. దీన్ని సాగుచేసే రైతులకు ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. సబ్సిడీపై మొక్కలు, ఎరువులు, మూడేళ్లపాటు అంతరపంటకు పెట్టుబడి, డ్రిప్ తదితర సౌకర్యాలను కలిపిస్తున్నారు. ఎకరానికి కనీసం రూ.50వల వరకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందుతుంది. ప్రస్తుతం పామాయిల్ విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నందు వల్ల ఆయిల్‌పామ్‌కు డిమాండ్ ఏర్పడింది. టన్నుకు రూ.20వేల వరకు ధర లభిస్తుంది. ఒక్కోసారి విదేశాలనుంచి దిగుమతి సుంకాలు పెరిగినప్పుడు ఈ ధర మరింతగా పెరుగుతుంది. వేసిన నాలుగో ఏడాది నుంచే ఉత్పత్తి ప్రారంభమవుతుండడం.. ఎకరానికి 10నుంచి 15టన్నుల వరకు దిగుబడి వస్తుండడంతో.. రైతులు అధికంగా ఆయిల్‌పామ్ వైపు దృష్టా సారిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం మిర్చి, పత్తి వంటి పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, వరికి పెట్టుబడి పెరగడం, తదితర కారణాలతో వ్యవసాయం సాగు క్లిష్ట పరిస్థితిగా మారింది. కూలీల కొరత భారీగా ఉండడం.. ప్రతీ యేడు పెరుగుతున్న పెట్టుబడుల కారణంగా ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌వైపు రైతాంగం అడుగులు వేస్తోంది. జిల్లాలో ప్రధానంగా రఘునాధపాలెం,కొణిజర్ల, కారేపల్లి కామేపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి చింతకాని, వైరా, ఏన్కూరు, వేంసూరు, ఖమ్మం అర్బన్ తదితర మండలాల్లో ఆయిల్‌పామ్‌సాగుకు ప్రతీ యేడు ఆదరణ పెరుగుతోందని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంవీ మధుసూదన్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వంతో పాటు ఉద్యానశాఖ నుంచి అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. రైతులు అన్నిరకాల భూముల్లో ఆయిల్‌పామ్ సాగుచేయవచ్చునని తెలిపారు. మార్కెట్ సమస్య కూడా ఉండదన్నారు.

జిల్లాలో రెండు చోట్ల పరిశ్రమలు

జిల్లాలో పామాయిల్ పరిశ్రమలు కూడా రాబోతున్నాయి. ఇప్పటి వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, అప్పారావుపేటలో పరిశ్రమలు ఉన్నాయి. గోద్రేజ్‌కంపెనీ ఆధ్వర్యంలో ప్రైవేటు రంగంలో కొణిజర్ల మండలం (మిగతా 6వ పేజీలో)



నాగపూర్ నుంచి కోటమ్మను ఆమె కుటుంబం వద్దకు పంపుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కుందా, సిబ్బంది

అమ్మొచ్చింది..

- మతిస్థిమితం లేక వెళ్లిపోయి.. పదేళ్ల తర్వాత బిడ్డల చెంతకు చేరిన తల్లి
- చనిపోయిందనుకొని కర్మకాండలు జరిపించిన సంతానం
- నాగపూర్‌లోని ఆస్పత్రిలో మహిళ ఆశ్రయం
- బిడ్డల వద్దకు తల్లిని చేర్చిన అన్నం ఫౌండేషన్

6

మద్యంలో విషం ఇచ్చి.. కొడుకును చంపి..

- ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన
- కుటుంబ తగాదాలే కారణం

7



చింతకానిలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

రామారావును కాంగ్రెస్ నాయకులే చంపేశారు

- రాజకీయ హత్యను పక్కదోవ పట్టిస్తున్న పోలీసులు
- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు
- నిందితులను వదిలి.. కుటుంబీకులను వేధిస్తున్నారని ఆగ్రహం

6

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు భద్రాద్రి క్రీడాకారుడి ఎంపిక

6

నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి: బీజేపీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

క్షణక్షణం.. ఉద్రిక్తం

- బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి
- ఆఫీసులోని కుర్చీలు, ఫర్నిచర్ దహనం
- బీఆర్ఎస్ కార్యాలయం 'హస్త'గతం
- భవనంపై కాంగ్రెస్ జెండా ఎగరేసిన కార్యకర్తలు
- ఇందిరమ్మ భవనంగా ఫ్లెక్సీ ఏర్పాటు
- ప్రత్యేక పోలీసు బలగాల మోహరింపు
- ఎంతో సంతోషంగా ఉంది : ఎమ్మెల్యే పాయం
- ఆధారాలు ఉంటే మేమే అప్పగిస్తాం : మాజీ ఎమ్మెల్యే రేగా

మణుగూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మణుగూరులో ఆదివారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ్యానికి ఉదయం చేరుకున్నారు. అకస్మాత్తుగా అక్కడి నుంచి బయలుదేరి ప్రదర్శనగా బీఆర్ఎస్ ఆఫీసుకు వెళ్లారు. బీఆర్ఎస్ ఆఫీసులోకి ప్రవేశించి.. కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్‌ను విరగ్గొట్టి బయట పడేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆఫీసు వైపునకు రావడంతో.. బీఆర్ఎస్ కార్యాలయంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులకు ఏమీ అర్థం కాకుండా పోయింది. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకులు.. బీఆర్ఎస్ నేతలను బయటికి తోసేసి ఫర్నిచర్ బయట పడేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. జై కాంగ్రెస్.. జై జై కాంగ్రెస్.. ఎమ్మెల్యే పాయం నాయకత్వం వర్థిల్లాలి.. అంటూ బిగ్గరగా నినాదాలు చేసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌కు చెందిన ఒకరిద్దరు కార్యకర్తలపై పిడిగుద్దులు కురిపించి.. కార్యాలయం నుంచి బయటకు గెంటేశారు. ఈ దాడిలో ఓ బీఆర్ఎస్ కార్యకర్తకు కంటి భాగంలో గాయమైంది. పెల్లుబికిన ఆగ్రహావేశాలతో ఉన్న కాంగ్రెస్ శ్రేణులు అంతటితో ఆగకుండా కార్యాలయం పై కి చేరుకుని బీఆర్ఎస్ జెండాలను పీకేసి.. కాంగ్రెస్ జెండాలను ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి, సీఐ నాగబాబు, ఎస్సై శ్రావణ్ కుమార్ వెంటనే ఘటనా స్థలికి చేరుకొని పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే వందల సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవడంతో.. పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో వారు పరిస్థితిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ భవనం పేరుకు పెయింట్లు వేసి తొలగించారు. అదే సమయంలో ఇందిరమ్మ భవనం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో మణుగూరులో క్షణక్షణం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మరోవైపు.. ఫర్నిచర్ దగ్ధంతో మంటలు చెలరేగి.. దట్టమైన పొగలు రావడంతో.. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే పనులను చేపట్టారు. ఆందోళనకారులు కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుని ఆనందాన్ని వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఏడేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తమ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుని బీఆర్ఎస్ భవనంగా మార్చారన్నారు. ఏడేళ్ల నుంచి నిరీక్షించిన తమకు ఈ రోజుతో కార్యాలయాన్ని తిరిగి హస్తగతం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు మరో మారు కార్యాలయంలోకి ప్రవేశించే (మిగతా 6వ పేజీలో)



ఇందిరమ్మ భవన్ ఫ్లెక్సీ ఏర్పాటు



మంటల్లో కాలిపోతున్న ఫర్నిచర్, కంప్యూటర్, ఇతర సామగ్రి

రెచ్చగొట్టే రేగా వ్యాఖ్యలే ఆందోళనకు కారణం..

- ఇటీవలి బీఆర్ఎస్ ఆందోళన ఆజ్యం పోసింది
- వ్యూహాత్మకంగా ముట్టడికి కాంగ్రెస్ ప్రణాళిక
- కార్యాలయం కైవసం అనంతరం బాణసంచా కాల్చి ఆనందం
- ఎన్నికల ప్రచారంలో కచ్చితంగా స్వాధీనం చేసుకుంటామన్న అగ్రనేతలు
- ఏడేళ్ల తర్వాత ఫలించిన కల

6

పంచాయతీలు.. అప్పులపాలు!

- నిధుల్లేక నీరసించిన అభివృద్ధి
- జిల్లాలో రూ. 10కోట్లకు పైగా బకాయిలు?



"పైన కనిపిస్తున్న ట్రాక్టర్ ఏన్కూరు మండలం పీకె బంజర పంచాయతీకి చెందింది. చిన్న పంచాయతీ కావడంతో జనరల్ ఫండ్ వసూలు కాక.. ప్రభుత్వం ఇచ్చే నిధులు రాక ఇదిగో ఇలా మూలన పడేశారు. దీన్ని ఏడాది కాలంగా వినియోగించడం లేదు."



ఖమ్మం రూరల్ మండలం ఎం వెంకటాయపాలెం పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ మందటి సంధ్యారాణి. తన హయాంలో నాలుగేళ్ల క్రితం గ్రామంలో శ్మశాన వాటికను అభివృద్ధి చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పని చేయాల్సి రావడంతో అప్పు చేసి మరీ దాన్ని పూర్తి చేశారు. పూర్తి చేసి నాలుగేళ్లు కావొస్తోంది. ఎంబీ చేసి రూ. 12లక్షల బిల్లును నేటికీ ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో అప్పుల పాలయ్యామంటూ ఆ మహిళా సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ పంచాయతీలు అప్పుల్లో కూరుకుపోయాయి. నిధులు లేక గ్రామాల్లో అభివృద్ధి మూలనపడింది. వర్షాలు పడుతుంటే ప్రజలు జ్వరాల బారిన పడుతున్నా.. పారిశుధ్యం పనులు చేయాలంటే పంచాయతీల్లో చిల్లిగవ్వ కూడా లేని హీనస్థితి. పారిశుధ్య పనులు చేపట్టే కార్మికులకు వేతనాలు బోటాబోటీగా చెల్లించడం తప్పా.. ఇంకా వేరే పనులేమీ ముందుకు సాగడం లేదు. గత ఏడాది జనవరి వరకు పంచాయతీల పాలన ముగిసింది. అప్పటి నుంచి మాజీ సర్పంచ్‌లకు బకాయిలు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా 571 పంచాయతీల్లో అప్పటి ప్రభుత్వం చెత్త సేకరణ, ఇతర కార్యక్రమాల కోసం వినియోగించేందుకు ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. 318 పంచాయతీలు ట్రాక్టర్లకు ఈఎంఐలు చెల్లించలేని దౌర్భాగ్య స్థితి. దీంతో వాటిని వినియోగించక నిరుపయోగంగా పడేశారు. పల్లెల్లో వీధి దీపాలు, నీటి ట్యాంకుల నిర్వహణ అటకెక్కింది. విద్యుత్తు బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు. నిధుల లేమితో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది.

పాలకవర్గాలు లేకపోవడంతో..

సర్పంచుల పదవీ కాలం గత ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. వాస్తవానికి ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గం కొలువుదీరాలి. కానీ ఏడాది దాటినా ప్రత్యేకాధికారులతోనే కాలం వెల్లదీస్తున్నారు. గ్రామాల్లో కనీస అవసరాలైన తీరుతున్నాయంటే అదీ లేదు. పాలకవర్గాలు ఉంటే కేంద్రం ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేవి. వాటితో మౌలిక వసతులైనా సమకూరేవి. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల చేయక పోవడంతో.. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా రావడం లేదు. దీంతో పంచాయతీ కార్యదర్శులు వీధి దీపాలు, బ్లీచింగ్ అప్పులు తెచ్చి మరీ చేయిస్తున్నారు. ఒక్కో పంచాయతీలో గ్రామకార్యదర్శులు లక్షకు పైగా అప్పులు చేశారు. వాటి బిల్లులు ఎవరు.. ఎలా చెల్లించాలో కూడా పాలుపోని పరిస్థితి.

సొంతంగా ఖర్చులు

ప్రభుత్వం పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించింది. నిధులు లేకపోవడంతో వారూ ఏం చేయలేని పరిస్థితి. కొన్నిచోట్ల పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులు తామే సొంతంగా ఖర్చు చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి పైసా రాకున్నా చెత్త సేకరణ, మురుగు కాల్వలు, నీటి ట్యాంకుల శుభ్రం, క్లోరినేషన్ తదితర పనులు చేయాల్సి వస్తోంది. ఆ డబ్బులు ఎప్పుడొస్తాయోనని నిరీక్షిస్తున్నారు. ఆదాయం ఉన్న పంచాయతీల్లో మాత్రం ఇంటి, నీటిపన్ను వసూళ్లపై దృష్టి సారించి ఆ నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇకపై పాలకవర్గాలు ఏర్పడితేనే వ్యవస్థ గాడిలో పడే అవకాశం ఉంది.

జిల్లాలో మొత్తం గ్రామపంచాయతీలు : 571

ట్రాక్టర్లకు ఈఎంఏలు చెల్లించాల్సిన జీపీలు	: 318
ప్రస్తుత ఈఎంఐ బకాయిలు	:3కోట్ల, 33లక్షల 84వేల642
కరెంటు బిల్లుల బకాయిలు	: రూ 2కోట్ల 24లక్షలు
పనిచేస్తున్న పారిశుద్య కార్మికులు	: 2082
వారికి రావాల్సిన బకాయిలు	: రూ 1కోటి 97లక్షల 79వేలు
సర్పంచ్‌లకు వివిధ పనుల కోసం రావాల్సిన బకాయిలు	: 9కోట్ల 6 లక్షలు

జగన్మోహిని అలంకరణలో భద్రాద్రి రామయ్య దర్శనం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో క్షీరాబ్ధి ద్వాదశిని (చిలుకు ద్వాదశి)ని పురస్కరించుకొని భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి జగన్మోహిని అలంకారంలో అందంగా అలంకరించి మేళతాళాలతో నిత్య కల్యాణ మండపంకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమయంలో దేవస్థానం ఆస్థాన విద్వాంసులు భక్త రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను ఆలపిస్తుండగా అందుకు అనుగుణంగా ప్రత్యేక హారతులను సమర్పించారు. ఈ సమయంలో స్వామికి క్షీరామృతంను నివేదన చేసి భక్తులకు వినియోగం చేశారు. రాజాధి వాహనంపై స్వామి వారు జగన్మోహిని అలంకారంలో తిరువీధి సేవకు తరలి వెళ్లగా భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కెదామోదర్‌రావు దంపతులు, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చిలుకు ద్వాదశి కావడంతో రామాలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో సైతం భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో ఒక ఆవుకు సంవత్సరం పాటు దత్తత నిమిత్తం రూ.50 వేలు విరాళాన్ని గుంటూరుకు చెందిన ఆవుల శివకుమారి అందజేశారు.

రైతుల చూపు ఆయిల్‌పామ్ వైపు



(5వ పేజీ తరువాయి)

అంజనాపురంలో 15టన్నుల ఉత్పత్తితో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ నాటికి మొదటి యూనిట్ పనులు పూర్తి చేసి ఉత్పత్తిని ప్రారంభించే అవకాశం ఉంది. అలాగే వేంసూరు మండలంలో కూడా ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో కూడా ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు అవుతుంది. ఈ రెండు పరిశ్రమలు జిల్లాలో ఉత్పత్తిని ప్రారంభిస్తే రైతులకు మరింత సౌలభ్యం కలగనుంది.

మంత్రి తుమ్మల ఆదర్శం

● మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ మానుకొండ రాధాకిషోర్



నేను మిర్చి, పత్తి, వరి, మామిడి సాగుచేసే రైతును. ఆయిల్‌పామ్ అంటే అసలు తెలియదు. 2009 లో మొదటిసారి ఆయిల్‌పామ్ గురించి అప్పటి ఖమ్మం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వగ్రామం గండుగులపల్లి వెళ్లి ఆయిల్‌పామ్ పంట చూశా. దాని గురించి తెలుసుకున్నా. రఘునాధపాలెం మండలం బాలప్పేటలో మిర్చి , వరి, మామిడి పంటల వల్ల పెద్దగా లాభాలు చూడలేకపోయా. దీంతో ఆయిల్‌పామ్ వేయాలని ఆసక్తికలిగి 2015లో తుమ్మల ఆయిల్‌పామ్ క్షేత్రం పరిశీలించి 2016లో మొదట 15 ఎకరాల్లో వేశా.నాలుగో ఏడాదినుంచే దిగుబడి మొదలయింది. ఇక్కడున్న భూమి ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉండడంతో దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. దాంతో తతర్వాత అతర్వాత 10 ఎకరాలు, ఆతర్వాత 28 ఎకరాలు మొత్తం 53 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగుచేయడం జరుగుతుంది. ఎకరానికి లక్షన్నరనుంచి ధర అధికంగా ఉంటే రూ.2లక్షల ఆదాయం వస్తుంది. గతంలో మిర్చి, వరి, మామిడి వంటి పంటలు వేసి ఏనాడు లాభాలు చూలేదు ఇప్పుడు ఓ ఐటీ ఉద్యోగిలా ప్రతిఏటా ఆదాయం సంపాదిస్తున్నా. 9 ఏళ్లక్రితం 15ఎకరాలు, ఏడేళ్లక్రితం 10, నాలుగేళ్ల క్రితం 28 ఎకరాలు దశలవారీగా మాకున్న 70 ఎకరాలోల 53 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నా. ఇప్పుడు జిల్లాలోనే నా ఆయిల్‌పామ్ క్షేత్రం మోడల్‌గా నిలిచింది. దిగుబడులు, ఎదుగుదల ఆశాజనకగా ఉంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాతోట చూసి ప్రశంసించారు. జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు చెందిన రైతులు వచ్చి చూసి వెళుతున్నారు. ఆయిల్‌పామ్ పంట కు కోతలు బెడద, అధికవర్షాలు, గాలిదుమారాలు, ప్రకృతివైపరిత్యాలతో నష్టం ఉండదు.

రామారావును కాంగ్రెస్ నాయకులే చంపేశారు

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

చింతకాని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం నాయకుడు సామినేని రామారావు హత్యను ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని.. రామారావును ముమ్మాటికీ కాంగ్రెస్ నాయకులే చంపేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజవర్గంలో కాంగ్రెస్ రాజకీయ హత్యలను ప్రేరేపిస్తోందన్నారు. మృతుడి భార్య స్వరాజ్యం ఫిర్యాదుపై పోలీసులు ఇప్పటివరకు స్పందించలేదన్నారు. గ్రామానికి చెందిన ఐదుగురు కాంగ్రెస్ నాయకులపై తనకు అనుమానం ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నప్పటికీ.. ఇప్పటివరకు వారిని విచారించడం, ఫోన్లను రికవరీ చేయడం చేయలేదన్నారు. పోలీసులు నిందితులను వదిలి విచారణ పేరుతో రామారావు కుటుంబ సభ్యులను వేధిస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామారావు హత్యకు సంబంధించి కాంగ్రెస్ అసత్య ప్రచారాలు చేస్తోందన్నారు. ఆయనకు కుటుంబ, వ్యక్తిగత, ఆస్తి తగదాలు లేవన్నారు. రాజకీయంగా ఎదుర్కొనలేకే కాంగ్రెస్ నాయకులు రామారావును హత్య చేయించారన్నారు. నిందితులను వెంటనే పట్టుకోవాలని డిమాండ్ చేశారు. రామారావు కుటుంబానికి న్యాయం జరిగేలా సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

తల్లాడ, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ధూపాటి అంకంరాజు కుటుంబానికి అతని తోటి స్నేహితులు ఆదివారం రూ.30 వేలు ఆర్థికసహాయం అందించారు. తల్లాడ హైస్కూల్‌లో 1989 బ్యాచ్‌పదో తరగతి పూర్వవిద్యార్థులు చేయూతనందించారు. అంకంరాజు కుమార్తె ధూపాటి హిమజ పేరుతో రూ.30వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను అందించారు. దగ్గుల కరుణాకర్‌రెడ్డి, నారాయణ, శ్రీనివాసరావు, జనార్ధన్‌రావు, అప్పారావు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైంది

» అదనపు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ సైదులు



మాట్లాడుతున్న సైదులు

భద్రాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ వృత్తి పవిత్రమైందని అదనపు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ డి. సైదులు అన్నారు. భద్రాచలంలో ఆదివారం మారుతి పారామెడికల్ కళాశాలలో బీఎస్సీ, జీఎన్ఎం మొదటి సంవత్సరం క్యాపింగ్ సెర్మనీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నర్సింగ్ వృత్తి బాధ్యతతో కూడిందని, విధి నిర్వహణలో లోపం లేకుండా నైపుణ్యంతో నిర్వహించాలని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో శిక్షణ పొందిన వారికి అపారమైన ఉద్యోగ అవకాశా లు ఉన్నాయని, స్వదేశంతో పాటు విదేశీ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రయివేటు సంస్థలలో ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ వి.కోటిరెడ్డి, డాక్టర్ పి. పుల్లయ్య, డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ ఆర్. చైతన్య, డాక్టర్ జీవీవీ. సుదర్శనరావు, డాక్టర్ జయభారతి పాల్గొన్నారు.

అమ్మొచ్చింది..

పినపాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని ఓ తల్లి బిడ్డలకు చెప్పకుండా వెళ్లిపోయింది. ఎక్కడికి వెళ్లిందో, ఎలా వెళ్లిందో తెలియదు. తల్లి జాడకోసం ఉమ్మడి తెలంగాణా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తెలిసినవారిని, బంధువులను, పరిచయస్థులనందరిని వాకబు చేశారు. అయినా ఆచూకీ లేదు. అసలు ఉందో, చనిపోయిందో తెలియని ఆ తల్లి కోసం బిడ్డలు పడిన యాతన వర్ణణాతీతం. ఇక చేసేదేమీ లేని పరిస్థితుల్లో గత ఏడాది ఆ తల్లికి సంతానం ఖర్మకాండలు జరిపించింది. ఈ పరిస్థితుల్లో మీ అమ్మ బతికే ఉందంటూ ఓ సమాచారం ఆ బిడ్డలకు చేరింది. తల్లి బతికే ఉందంటూ వచ్చిన సమాచారాన్ని నమ్మలేని పరిస్థితుల్లో ఏకంగా ఆ తల్లిని ఇంటికే తీసుకొచ్చి, చూపిస్తే, ఆ బిడ్డల కళ్లలో రాలినవి కన్నీటి ధారలు కావు..ఆనంద విలయ తుఫానే అనుకోవాలి. కొందరి సహృదయుల మానవత్వం ఆ తల్లిబిడ్డలను కలిపింది. వివరాల్లోకి వెళితే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన జల్లారపు కోటమ్మకు ముగ్గురు సంతానం. సంతానం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే భర్త సమ్మయ్య అనారోగ్యంతో చనిపోయాడు. ముగ్గురు సంతానంతో, రెక్కాడితే డొక్కాడని ఆ కుటుంబానికి తల్లి కొంతకాలం జీవనపోరాటం చేసింది. సాఫీగా సాగుతున్న జీవితంలో మరో అలజడి ఆ కుటుంబాన్ని కోలుకోనీయకుండా దెబ్బ తీసింది. తల్లి కోటమ్మ మానసిక కుంగుబాటుతో మతిస్థిమితం కోల్పోయింది. అయినప్పటికీ తన సంతానమైన ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకుకు తోడుగా ఆ పని, ఈ పని చేస్తూ సాకింది. బిడ్డలు కాస్త పెద్దోళ్లు అయ్యారు. కూలీనాలి పనులకు వెళ్తూ ముగ్గురూ కష్టపడుతూనే తల్లిని సాకుకున్నారు. కూతుళ్లకు పెళ్లి చేసి, భారం తగ్గించుకుంది. కొడుకు దగ్గర ఉంటూనే తల్లి అకస్మాత్తుగా ఓ రోజు బహిర్భుమికని వెళ్లి, ఇంటికి చేరుకోలేదు. మొదట తెలిసిన, బంధువుల ఇండ్లకు వెళ్లి ఉంటుందని భావించిన ఆమె బిడ్డలు, తెలిసిన వారిని, బంధువులను, పరిచయమున్నవారిని అందరిని వాకబు చేసి, వెదికి వెదికి వేశారారు. సుమారు పదేండ్లు కావొస్తున్నా తల్లి జాడ తెలియకపోవడంతో, తల్లి చనిపోయి ఉండొచ్చని భావించిన ఆమె బిడ్డలు గతేడాది తల్లికి ఖర్మకాండలు జరిపించారు.

● అన్నం ఫౌండేషన్ కృషితో బిడ్డల చెంతకు చేరిన తల్లి

జల్లారపు కోటమ్మ తన బిడ్డలకు దూరమై పదేళ్లు కావొస్తున్నా, ఆమె జాడలేదు. స్థానికంగా పలు స్టేషన్ల పరిధిలో ఫిర్యాదులు చేశారు. కాని ఆమె మహరాష్ట్రలోని నాగపూర్ ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ట్రీట్‌మెంట్ తీసుకుంటూ, ఆశ్రయం పొందింది. ఆమెకు డాక్టర్ కుందా కాతేఖాయి బిడ్కర్ ఆమెకు వైద్య సేవలందించి, ఖమ్మం అన్నం ఫౌండేషన్ శ్రీనివాసరావుకు సమాచారమిచ్చారు.



శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

వీడియోకాల్‌లో ఆమెతో మాట్లాడిన శ్రీనివాసరావు, ఆమె నుంచి కొద్దికొద్దిగా సమాచారం రాబట్టి, ఎట్టకేలకు ఆమెది పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారంగా గుర్తించారు. అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమెను నాగపూర్ వెళ్లి తీసుకువచ్చి, ఆమెను ఆదివారం తన బిడ్డల చెంతకు చేర్చారు. తమ తల్లిని పదేండ్ల తర్వాత చూసిన బిడ్డలు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తల్లిని అక్కున చేర్చుకుని, వైద్య సేవలందించిన నాగపూర్ సామాజిక సేవా ఆసుపత్రి సూపరిండెంట్ కుందా కాతేఖాయి బిడ్కర్‌కు మీ రుణం తీర్చుకోలేమంటూ ధన్యవాదములు తెలిపి, అన్నం ఫౌండేషన్ శ్రీనివాసరావును కుటుంబ సభ్యులు సన్మానించారు.

క్షణక్షణం.. ఉద్రిక్తం

(5వ పేజీ తరువాయి)

ప్రయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడం.. ఆందోళనకారులు అధిక సంఖ్యలో ఉండడంతో.. స్పందించిన ఎస్పీ వెంటనే మణుగూరుకు స్పెషల్ పార్టీ బలగాలను పంపించారు. మణుగూరు సబ్ డివిజన్ పోలీసులతో పాటు జిల్లాలోని పలు మండలాల సీఐలు, ఎస్సైలు మణుగూరుకు చేరుకొని.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

● బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

తమ కార్యాలయంలో విధ్వంసానికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులను వెంటనే ఇక్కడి నుంచి వెనక్కి పంపించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మణుగూరులోని ప్రధాన రోడ్డుపై ఆందోళన చేశారు. దీంతో వారికి సర్ది చెప్పేందుకు మణుగూరు సీఐ నాగబాబు, ఇతర పోలీసు అధికారులు ఎంత ప్రయత్నించినా.. ఫలితం కనిపించలేదు. కాంగ్రెస్ నేతలను పంపితేనే తాము వెళతామంటూ.. బీఆర్ఎస్ నాయకులు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య కొంత దూరాన్ని ఏర్పాటు చేసి స్పెషల్ పార్టీ బలగాలు.. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా చూశాయి.

● ముమ్మాటికీ కాంగ్రెస్ కార్యాలయమే

మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న పార్టీ కార్యాలయం ముమ్మటికీ కాంగ్రెస్ పార్టీదేనని స్థల దాత వారసుడు పికెఎస్ హరిబాబు అన్నారు. 1980 సంవత్సరం లో తన తండ్రి అయిన పిళ్ళారిశెట్టి సత్యనారాయణ వద్దకు నాటి ఎమ్మెల్యే చందాలింగయ్య, మండల కాంగ్రెస్ నాయకులు బత్తుల వీరయ్య, పోలమూరి రాజు వచ్చి కాంగ్రెస్ కార్యాలయం కోసం స్థలం అడిగారని తెలిపారు. కాంగ్రెస్‌పై అభిమానంతో తన తండ్రి ఈ స్థలాన్ని కేటాయించగా.. అక్కడ భవనాన్ని నిర్మించి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తర్వాత నాయకులు పార్టీలు మారారని, ఆ తర్వాత కార్యాలయాన్ని మార్చారని చెప్పారు.



బీఆర్ఎస్ కార్యాలయంలో ఫర్నిచర్‌ను బయట పడేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

● ఆందోళనల నేపథ్యానికి కారణం ఇదీ..

కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ద్వారా తొలిసారి 2009-14, ఆ తర్వాత 2018 చివర్లో జరిగిన ఎన్నికల్లో మరోసారి పినపాక ఎమ్మెల్యేగా రేగాకాంతారావు గెలిచారు. అనంతరం 2019లో ప్రజా అభివృద్ధే ధ్యేయంగా టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) లో చేరుతున్నట్లు ప్రకటించి పార్టీ మారారు. అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా ఉన్న ఈ భవనాన్ని ఆ తర్వాత టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంగా రేగాకాంతారావు మార్చారు. దీంతో అప్పుడే ఈ విషయాన్ని తీవ్ర స్థాయిలో ఖండించిన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరాహార దీక్షలను కూడా చేపట్టారు. ఈ విషయంపై జరిగిన ఆందోళనలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ.. అప్పటి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ బలరామ్, తదితరులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. మణుగూరు మునిసిపాలిటీ కార్యాలయానికి చేరుకుని ఈ విషయమై స్థానిక అధికారులను ప్రశ్నించారు. ఖచ్చితంగా ఇది కాంగ్రెస్ పార్టీకే చెందాలని చెప్పి వెళ్లారు.

● శంకుస్థాపన చేసింది మేమే..

పిళ్లారిశెట్టి సత్యనారాయణ పార్టీకి దానంగా ఇచ్చిన స్థలంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి 2009, ఆగస్టులో శంకుస్థాపన చేసిన కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడిగా తానే ఉన్నట్టు పార్టీ సీనియర్ నాయకుడు పోలమూరి రాజు తెలిపారు. తనతో పాటు ఈ కార్యక్రమంలో చందాలింగయ్యదొర, తదితరులు కూడా హాజరయ్యారని చెప్పారు. భవన నిర్మాణానికి మాజీ ఎంపీ బలరామ్ నాయక్ సిమెంట్ విరాళంగా అందించగా.. కలపను తాను చర్ల వెంకటాపురం నుంచి తెప్పించినట్టు చెప్పారు. నిర్మాణం పూర్తయిన ఈ ఇందిరమ్మ భవనానికి నాటి పీసీసీ ప్రెసిడెంట్, మంత్రి సంబాని చంద్రశేఖర్ ప్రారంభోత్సవం చేశారని తెలిపారు. అయితే మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పార్టీ మారిన తర్వాత కార్యాలయాన్ని కూడా కబ్జా చేసి తెలంగాణ భవన్‌గా మార్చారన్నారు.

రెచ్చగొట్టే రేగా వ్యాఖ్యలే ఆందోళనకు కారణం..

మణుగూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో చేరి ముట్టడించడం వెనుక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా చేసిన చేస్తున్న వ్యాఖ్యలే కారణమని రాజకీయ పార్టీల విశ్లేషకులు భావిస్తున్నారు. అంతే కాకుండా ఇటీవల కాలంలో ప్రధాన సెంటర్‌లో ఆందోళనలు మరి రెచ్చగొట్టేవిగా ఉన్నాయన్నారు. గతంలో రేగా కాంతారావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రధాన రహదారి గుంతల మయంగా లేదా అప్పుడు ప్రజలు ఇబ్బందులు పడలేదా ఇప్పుడు తానేదో ప్రజల పక్షాన ఆందోళన అంటూ రోడ్డెక్కడం విడ్డూరంగా ఉందనే విమర్శలు వెలువడ్డాయి. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎవరిదన్న విషయం జగమెరిగినా నాడు తనకున్న అధికార బలంతో కబ్జా చేశారని ఆరోపనలు నాటి నుంచి నేటి వరకు వినబడుతున్నాయి. దాదాపు ఏడేళ్లగా రగులుకున్న ఈ కార్యాలయం చిచ్చు ఆదివారం నాటికి తీవ్ర స్థాయికి చేరుకుంది. అధికార పార్టీలో లేని వారే ఇంతగా మిడిసి పడుతుంటే మనమెందుకు నోరుమూసుకుని ఉండాలనుకున్న కాంగ్రెస్ శ్రేణులు వ్యూహాత్మకంగా పావులు కదిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని రేగా కాంతారావు ఇస్తున్న ప్రకటనలు కాంగ్రెస్ శ్రేణుల్లో అగ్నికి ఆధ్యం పోసినట్లైంది. దీంతో మా కార్యాలయంలో ఉంటూ మా ఎమ్మెల్యే కాంపు కార్యాలయాన్నే ముట్టడి చేస్తామంటావా.. అని ప్రశ్నలు ఉత్పన్నమైన కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం తమ సహనాన్ని కోల్పోయ్యారు. ఇన్నాళ్లు తమలో ఉన్న ఆవేధన కట్టలు తెంచుకునే సరికి ఆదివారం నియోజకవర్గ పార్టీ నాయకులు అంతా సమావేశమై ఈ విధ్వంస చర్యలకు పూనుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కాదు ఇది మా కాంగ్రెస్‌ఆఫీసు అంటూ నాయకులు కార్యకర్తలు వందల సంఖ్యలో ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎవరూ ఊహించని విధంగా ఈ ఆందోళన జరగడం అందరినీ విస్మయానికి గురిచేసింది. మా పార్టీ కార్యాలయంలో మీ కుర్చీలు, ఫర్నిచర్ కంప్యూటర్లేందుకు అంటూ ఆందోళన కారులు కార్యాలయంలో అన్ని వస్తువులను బయటికి లాగి పడేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ ఆందోళన అనంతరం ఎట్టకేలకు పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ జెండాను ఏర్పాటు చేయడమే కాకుండా ఇందిరమ్మ భవనం అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేసి బాణా సంచా కాల్చి జై కాంగ్రెస్ అంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

2019 లో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరడం తర్వాత పార్టీ కార్యాలయాన్నే తెలంగాణ భవన్‌గా మార్చడం మింగుడు పడని కాంగ్రెస్ పార్టీని యోజకవర్గ నేతలంతా నివురు గప్పిన నిప్పుల తమ ఆవేధనను తమ మనస్సుల్లోనే నింపుకున్నారు. గత ఎన్నికల ముందు మణుగూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నేటి సీఎం రేవంత్ రెడ్డి, నాటి ములుగు ఎమ్మెల్యే సీతమ్మ, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య , మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ బలరాం నాయకులు అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కబ్జా విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ ప్రజలను, కాంగ్రెస్ పార్టీ నాయకులల్లో రెట్టింపు చైతన్యాన్ని నింపింది. ఈరోజు మీరు అధికారంలో ఉన్నారు.. రేపటి రోజున మేము అధికారంలోకి వస్తాం అప్పుడు ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఖచ్చితంగా స్వాధీనం చేసుకుంటామని ప్రకటించడం కాంగ్రెస్ శ్రేణుల్లో నాడే ఆత్మస్థైర్యం నింపింది. నాటి నుంచి నేటి వరకు వేచి చూసిన నియోజకవర్గ నాయకులు ఈ రోజున ఈ ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కాంగ్రెస్ సినియర్ నాయకులు పేర్కొంటున్నారు. ఏడేళ్ల నిరీక్షణకు నేటితో కాలం చెల్లిందని అక్రమ ఖబ్జా దారులకు చెంప పెట్టులా కాంగ్రెస్ వాదులు సమాదానం చెప్పారని వారంటున్నారు.

ఎంతో సంతోషంగా ఉంది

● పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

తమ శ్రమతో పైసా పైసా కూడబెట్టుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కాంగ్రెస్ కార్యాలయంగా ఇందిరమ్మ భవనాన్ని నిర్మించుకుంటే దాన్ని కబ్జా చేసి తెలంగాణ భవన్‌గా మార్చారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిరిగి తమ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. తమకు ఇది ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఆధారాలు ఉంటే మేమే అప్పగిస్తాం..

● మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

ప్రజాసామ్యానికి తూట్లు పొడుస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మణుగూరులోని తెలంగాణ భవన్‌పై దాడి చేశారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. హైదరాబాద్ నుంచి ఆదివారం సాయంత్రం మణుగూరుకు చేరుకున్న రేగా కాంతారావు అంబేద్కర్ సెంటర్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. తమ వద్ద ఇందుకు సంబంధించిన ఆధారాలన్నీ ఉన్నాయన్నారు. డాక్యుమెంట్ రూపంలో వారి వద్ద ఏమైనా ఆధారాలు ఉంటే చూపించాలని, అలా చేస్తే తాము వెంటనే ఖాళీ చేసి పోతామని రేగా అన్నారు. ఆధారాలు లేకుండా ఇలాంటి దాడులకు పూనుకోవడం ఏ మాత్రం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుని. రాష్ట్రంలో ఏదో మూల ఇలాంటి గొడవలు చేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. ఇలాంటి దాడులకు, బెదిరింపులకు తాను భయపడే పరిస్థితి లేదన్నారు. జరిగిన సంఘటనకు సంబంధించి పూర్తి సమాచారాన్ని, వీడియోలను పరిశీలించి ఏమి చేయాలో చేస్తానని తెలిపారు. మూడు గంటల్లో సమాచారం సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం ఏ మాత్రం లేదన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

» ఎమ్మెల్యే కూనంనేని



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఈ నెల 11న కొత్తగూడెంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మె ల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ సమీప ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జాబ్ మేళా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ జాబ్ మేళా కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రధాన కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. నిరుద్యోగ యువకులు విద్యార్హతను బట్టి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఏ కంపెనీలో ఏఏ ఉద్యోగాలు ఉన్నాయో సంస్థకు సంబంధించిన వివరాలను నిరుద్యోగులకు వివరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. సింగరేణి సంస్థ కొత్తగూడెం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కొత్తగూడెం బస్టాండ్‌ను నూతనంగా నిర్మించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో జాబ్ మేళాలు నిర్వహిస్తుందన్నారు. ఈ సమావేశంలో సింగరేణి ఎస్‌ఓటూ జీఎం జీవి. కోటిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, ఏజీఎం సివిల్ రామకృష్ణ, డీజీఎం మోహన్‌రావు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మల్లిఖార్జున్‌రావు, కంచర్ల జమలయ్య, వీరస్వామి, వాసిరెడ్డి మురళి, ఘట్టయ్య, ఈసూబ్ తదితరులున్నారు.

నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి: బీజేపీ

నేలకొండపల్లి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలో మొంథా తుఫాన్‌తో నష్టపోయిన వరి పొలాలను బీజేపీ నాయకులతో కలిసి కోటేశ్వరరావు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదన్నారు. రేవంత్ సర్కార్ పక్కాగా రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, రైతులకు బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పంటలు దెబ్బతిని రోజులు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు ఏఅధికారీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయలేదని రైతులు కోటేశ్వరరావుకు చెప్పారు. ముఖ్యమంత్రికి ఎన్నికలపై ఉన్న శ్రద్ధ రైతాంగంపై లేదని విమర్శించారు. గత ఏడాది వరద నష్టానికి జిల్లాలో దాదాపు 40వేల ఎకరాల పంట నష్టం జరిగినప్పటికీ నేటికీ రైతులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. మొంతా తుఫాన్ వల్ల జరిగిన నష్టం అధికారులు ప్రకటించిన దానికంటే చాలా ఎక్కువగా ఉందన్నారు. రైతులకు బీమా అమలు చేయడంలో రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నదని ఎద్దేవా చేశారు. రైతులకు వెంటనే నష్టపరిహారం అందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు మన్నె కృష్ణారావు మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, కల్యాణం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



వరి పొలాన్ని పరిశీలిస్తున్న నెల్లూరి కోటేశ్వరరావు

రాష్ట్ర పెరిక సంఘం గౌరవ ఆహ్వానితులుగా శ్రీనివాస్



భద్రాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘ గౌరవ ఆహ్వానితులుగా బుడగం శ్రీనివాస్‌ను రాష్ట్ర నాయకత్వం నియమించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన బుడగం శ్రీనివాస్ టీపీసీసీ సభ్యులుగా కొనసాగుతుండగా పెరిక కుల రాష్ట్ర గౌరవ ఆహ్వానితులుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయకుమార్, గౌరవ అధ్యక్షుడు మద్దాలింగయ్య, ముఖ్య సలహాదారు శ్రీరామ్ భద్రయ్యలకు జిల్లా పెరిక సంఘం నాయకులు బొలిశెట్టి రంగారావు, కుం చాల రాజారాం, యర్రంశెట్టి నరసింహారావు, బుడగం సాగర్, కట్టా నాగేందర్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు భద్రాద్రి క్రీడాకారుడి ఎంపిక



భద్రాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్-14 ఫుట్‌బాల్ జట్టుకు భద్రాచలానికి చెందిన దొడ్డిపట్ల కోటేష్ కుమారుడు పునీత్ ఎంపికయ్యాడు. 400 మంది క్రీడాకారులు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనగా తుది జట్టులో 16 మందిని సెలెక్టర్లు ఎంపిక చేశారు. అందులో భద్రాచలానికి చెందిన పునీత్ ఒకరు. వికారాబాద్ కేంద్రంగా జరిగే రాష్ట్రస్థాయి ఫు ట్‌బాల్ పోటీల్లో పునీత్ ఉమ్మడి జిల్లా జట్టు తరఫున పాల్గొననున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు కోటేష్ కుమారుడైన పునీత్ ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

కొంగబావకు క(ప్ప)మ్మని విందు

ఆహా ఏమి భోజనంబు.. పసందైన కప్ప విందు ఖమ్మం నగరంలోని బాలప్పేట రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం రోడ్డుపక్కన ఓ కొంగకు ఇష్టమైన విందు లభించింది. రోడ్డుపక్కన ఉన్న కొంగ పక్కనే ఉన్నపాలంలో కప్పను చటుక్కున నోటకరుచుకుని రివ్వున ఎగిరిపోయింది. ఈ సుందర దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఖమ్మం



రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మద్దులపల్లి విద్యార్థిని ఎంపిక



చరితశ్రీ

ఖమ్మం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన మాదరబోయిన చరితశ్రీ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. చరితశ్రీ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతుంది. అండర్-14 బ్యాడ్మింటన్ పోటీల్లో చరితశ్రీ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా చరితశ్రీని పాఠశాల ఉపాధ్యాయుల, మిత్రులు, బంధువులు అభినందించారు.

క్రీడా ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



క్రీడా ఏర్పాట్లను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

పినపాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ క్రీడా పోటీల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల వేదికైన ఏడూళ్లబయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8 ,9,10 తేదీల్లో జరగనున్న క్రీడాపోటీల ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి అండర్-17 పాఠశాలల క్రీడా పోటీలకు బాలబాలికల 20 జట్లు పాల్గొంటున్నాయని, అందుకు తగిన క్రీడా స్థలాలు, క్రీడాకారులు బస చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్రీడాకారులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లుండాలని మండలాధికారులను ఆదేశించారు. అవసరమైన మెటీరియల్, ఇతర ఏర్పాట్లకు తోడ్పాటును అందించాలని బీటీపీఎస్ సీఈ బిచ్చన్నతో చరవాణీలో మాట్లాడారు. నాలుగు కోర్టులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు ఉండాలని, గ్రౌండింగ్ కోసం గ్రావెల్‌ను సమకూర్చి, విద్యుత్, తాగునీరు, శానిటేషన్, హెల్త్ క్యాంప్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, భద్రతా సిబ్బంది, వంటి అంశాలతో సమగ్ర ప్రణాళికతో, జిల్లా యువజన క్రీడలు, పోలీస్, పంచాయతీరాజ్‌శాఖ, విద్యాశాఖ, అటవీ, విద్యుత్‌శాఖల సమన్వయంతో నిర్దేశిత సమయంలోగా ఏర్పాట్లు పూర్తికావాలని ఆదేశించారు.

అనంతరం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆంధ్రజ్యోతి కలెక్టర్‌ను ప్రశ్నించగా, సోమవారం నుంచి అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని వివరణ ఇచ్చారు. అనంతరం పెద్దవాగు కోతకు గురవుతున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు నివేదికలు తయారు చేస్తామన్నారు. సుమారు 16 కుటుంబాలు ప్రమాదపుటంచున గడుపుతున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డిలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గోవిందాపురం, ఎల్లాపురం గ్రామాలకు పెద్ద వాగు కోత, వరద ముంపుకు గురవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని,తమకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేయాలని, పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు గొగ్గల రామకృష్ణ దొర, మండలాధ్యక్షుడు కొమరం శ్రీను కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం కంది తిరుపతి రెడ్డి, పీడీ బి.వీరన్న, నాయకులు శ్రీనివాసరెడ్డి, కొండేరు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు రాధాక్రిష్ణ



రాధాక్రిష్ణను అభినందిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5 నుంచి 9వరకు చెన్నైలో జరగనున్న ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన నున్నా రాధాక్రిష్ణ ఎంపికైనారు. ఆయన ఇటీవల జరిగిన బెంగుళూరులో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో జావెలిన్‌త్రో విభాగంలో రజత పతకం సాధించాడు. జాతీయ పోటీల్లో ప్రతిభ ఆధారంగా అంతర్జాతీయ స్థాయి ఆసియా పోటీలకు ఎంపికైనాడు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన రాధాక్రిష్ణను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు.ఆసియా పోటీల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ జట్లు సిద్ధం

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియంలో ఆదివారం అండర్-14 బాల, బాలికల షటిల్, అండర్-17 కరాటే, అండర్-14, 17 రగ్బీ ఎంపికలతో పాటు సెయింట్ జోసప్ పాఠశాలలో అండర్-14 బాస్కెట్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సుమారు 500మంది క్రీడాకారులు హాజరైనారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికలను ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వై.రామారావు, శ్యాం బాబు, శ్రీహరి, లాలయ్య, సైదేశ్వరావు, విజయ, రమణ తదితరులు సమీక్షించారు.



షటిల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

సాహస 'జితేషుడు'

కారడవిలో కలెక్టర్ జితేష్ ప్రయాణం

నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో రెండు గంటల పాటు పర్యటన

రహదారి నిర్మాణం చేపట్టాలన్న లక్ష్యంతోనే..



ఆళ్లపల్లి గ్రామానికి ఈ రహదారే దిక్కు

కరకగూడెం, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమే కాక నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా ఏర్పడింది. ఈ ప్రాంతాలకు అధికారులు రావాలంటే ముందస్తు ప్రణాళికతో ఇంకడకు వస్తుంటారు. అటువంటి తరుణంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎటువంటి బందోబస్తు లేకుండా కారడవిలో ప్రయాణం సాగించిన సంఘటన కరకగూడెం మండలంలో చోటుచేసుకుంది. కరకగూడెం మండలం నుంచి వీరాపురం క్రాస్ రోడ్డు నుంచి రేగళ్ళ మీదుగా జిన్నలగూడెం, మర్కోడు, ఆళ్లపల్లి వరకు అసంపూర్తి రహదారిని ఉంది కానీ ఈ రహదారి మధ్యలో సుమారు 10 కిలో మీటర్ల దూరంలో కిన్నెర సాని అభరణ్యం ఉండటంతో ఇక్కడ అటవీ శాఖ అధికారులు రహదారికి అనుమతులు ఇవ్వలేదు. దీంతో రెండు మండలాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక ఈ రహదారి పెద్దగుట్ట పరిసర ప్రాంతాలలోని రంగాపురం బేస్ క్యాంపు , మల్లెతోగు అటవీ ప్రాంతంలో మావోలకు, పోలీసులకు ఎదురు కాల్పులు జగడంతో ఒక గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ గాయాలు అయిన సంఘటన కూడా చోటు చేసుకుంది. దీంతో పోలీస్ శాఖ, అటవీ శాఖ ఆధ్వర్యంలో రేగళ్ళ నుంచి ఆర్‌ఎన్‌బీ రహదారి సరిహద్దు వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ రహరి నుంచి వాహనాలకు రాక పోకలను కిన్నెరసాని రిజర్వ్ అటవీ శాఖ అధికారులు నిలిపివేశారు.

కారడవిలో కలెక్టర్ ప్రయాణం.. రహదారి నిర్మాణం కోసమేనా..

కరకగూడెం మండలం నుంచి జిన్నలగూడెం, మర్కోడు, ఆళ్లపల్లి మీదుగా కొత్తగూడెం వెళ్లేందుకు 2016, 17 సంవత్సరంలో ఆర్‌ఎండీబీ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్డును జిన్నలగూడెం, అల్లాపల్లి నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. కానీ రేగళ్ళ నుంచి .జిన్నలగూడెం వరకు అడవీ శాఖ అనుమతులు లేక పోవడంతో సుమారు 10 కిలో మీటర్ల మేర రహదారి మార్గం నిలిచి పోయింది. అప్పటి నుంచి ఈ రహదారిలో రెండు మండలాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రహదారిని పరిశీలించినట్లు సమచారం.

'సామినేని' మృతిపై న్యాయ విచారణ చేపట్టాలి

రేపు, ఎల్లుండి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

ప్రకటించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు సామినేని రామారావు మృతిపై పోలీసులు న్యాయ విచారణ చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో పోతినేని మాట్లాడారు. పాతర్లపాడు గ్రామంలో సీపీఎం పార్టీ ఎదుగుదలను చూడలేకనే రాజకీయ దుర్బుద్ధితో హత్య చేశారని ఆరోపించారు. ప్రశాంతంగా ఉండే పల్లెల్లో సుపారీలు ఇచ్చి హత్యలు చేయించారని ఆరోపించారు. హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4, 5 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినట్లు ప్రకటించారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేశ్, బొంతు రాంబాబు, బండి పద్మ పాల్గొన్నారు.

ముస్లిం విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ కోటాను సద్వినియోగం చేసుకోవాలి

మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకుబ్‌పాషా

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): 2026 జనవరిలో జరగనున్న జేఈఈ మెయిన్స్‌కు హాజరయ్యే ముస్లిం విద్యార్థులందరూ ఈడబ్ల్యూఎస్ కోటాలో దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.యాకుబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో దరఖాస్తు చేసుకున్నట్లయితే 10శాతం రిజర్వేషన్లు పొందే అవకాశం ఉంటుందని, కావున ముస్లిం విద్యార్థులు మీసేవ కేంద్రంలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ కోసం ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 27 వరకు ఉన్నందున ముస్లిం విద్యార్థులు వెంటనే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను మీసేవా కేంద్రాల్లో పొందాలన్నారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందే క్రమంలో ఎలాంటి ఇబ్బంది కలిగిన 8520860785 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్య కార్యక్రమాలపై సీఆర్‌ఎం బృందం పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించుటకు సీఆర్‌ఎం బృందం ఆదివారం జిల్లాను సందర్శించింది. ఈ సందర్శనలో భాగంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన సీఆర్‌ఎం బృంద సభ్యులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలు జరుగుతున్న ప్రధాన ఆరోగ్య కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు మాతా శిశు ఆరోగ్యం, వ్యాధి నియంత్రణ చర్యలు, వైద్య సేవల విస్తరణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యత తదితర అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఆర్‌ఎం బృందం నవంబరు 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ వైద్య సంస్థలను సందర్శించి, ఆరోగ్య సేవల అమలు స్థాయిని, సిబ్బంది పనితీరును, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించనుందన్నారు. బృందం వైద్య సదుపాయాల అందుబాటు, మౌలిక వసతుల వినియోగం రోగులకు అదిస్తున్న సేవల నాణ్యతను కూడా విశ్లేషించనుందని తెలిపారు. ఈ బృందంలో డాక్టర్ గురిందర్‌బీర్‌సింగ్- అడ్వైజర్, సీపీసీ, పీహెచ్‌సీ, ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ, డాక్టర్ బి.వెంకట శివారెడ్డి - అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏఐఎంఎస్ మంగళగిరి, డాక్టర్ అజయ్ పాండే- అసిస్టెంట్ ప్రొఫెసర్ పీఆర్సీ లక్నో, డాక్టర్ అంకిత కంకర్య- అసిస్టెంట్ ప్రొఫెసర్, పీజీఐఎంఈఆర్ చండీఘడ్, డాక్టర్ అనర్‌సింగ్, డాక్టర్ - సీనియర్ కన్సల్టెంట్, ఎన్‌హెచ్‌ఎం పాలసీ, ఎంఓహెచ్‌ఎఫ్ డబ్ల్యు, డాక్టర్ కల్పనా భవానీ -సీనియర్ కన్సల్టెంట్, పీహెచ్‌ఏ, ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ సభ్యులుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జయలక్ష్మి, వివిధ ఆరోగ్య ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లా ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ అడుగుజాడల్లో ముందకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర నాయకులు రామకృష్ణ

అశ్వారావుపేట రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమ్మక్క సారలమ్మ అడుగుజాడల్లో ముందుకు సాగుతూ ఉద్యమంలో పాల్గొనాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు మైపతి అరుణ్‌కుమార్, చుంచు రామకృష్ణ సూచించారు. అశ్వారావుపేటలో ఆదివారం ఆదివాసీ మహిళ చైతన్యశక్తి పిలుపు మేరకు గోండ్‌రాణి రాణీ దుర్గావతి 501 జయంతి ఉత్సవాల్లో భాగంగా మహిళల సాధికారత అభివృద్ధి సదస్సును నిర్వహించారు. సదస్సుకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ మహిళలు భారీగా హాజరయ్యారు. నియోజకవర్గ అధ్యక్షురాలు మడివి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రింగ్‌రోడ్ సెంటర్ నుంచి ర్యాలీగా గిరిజన భవన్ వరకు వెళ్లారు. పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ మహిళలు, యువత ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సదస్సులో పలువురు మాట్లాడుతూ లంబాడీలను తొలిగించే వరకు ఉద్యమం ఆగదన్నారు. మహిళలు మగవారితో పోటీపడుతూ తమ హక్కుల సాధనలో ముందుకు నడవాలన్నారు. ఉద్యమాల్లో రాణి దుర్గావతిలా అందరూ ముందుకు సాగాలని కోరారు. ప్రతి ఆదివాసీ బిడ్డ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసి చైతన్యశక్తి రాష్ట్ర బాధ్యులు గుమ్మడి అనురాధ, చుంచు నీరజ, వెంకటలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో సపక నాగమణి, పొట్టా అరుణ, కణితి లక్ష్మి, సోయం వీరభద్రం, కారం శ్రీరాములు, మడకం వెంకటేశ్వరావు, మడివి కృష్ణారావు, సరోజినితో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు, ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు.

మద్యంలో విషం ఇచ్చి.. కొడుకును చంపి..

● ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన ● కుటుంబ తగాదాలే కారణం

తల్లాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ తగాదాల నేపథ్యంలో.. మద్యంలో విషమిచ్చి కన్న కొడుకునే తండ్రి హతమార్చిన దారుణ ఘటన ఖమ్మం జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని తల్లాడ మండలం కలకొడిమ గ్రామానికి చెందిన ఆదూరి రాజేష్, ఆదూరి నాగరాజు(18) తండ్రీకొడుకులు. నాగరాజు మద్యానికి బానిసై గ్రామంలో జులాయిగా తిరుగుతుండేవాడు. తండ్రి కూడా ఏ పనీ లేక ఇంటి వద్దే ఉండేవాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య గత కొంత కాలంగా గొడవలు నడుస్తున్నాయి. ఇది కాస్త ఇద్దరూ కొట్టుకునే స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో కొడుకు నాగరాజును మట్టుబెట్టాలని తండ్రి రాజేష్ నిర్ణయించుకున్నాడు. ముందస్తు పథకం ప్రకారం కలిసి మద్యం తాగుదామని నాగరాజును రాజేష్ నమ్మించాడు. ముందుగా అనుకున్నట్టు గత నెల 20వ తేదీన నాగరాజుకు విషం కలిపిన మద్యాన్ని రాజేష్ ఇచ్చాడు. మద్యం తాగిన నాగరాజుకు వాంతులు, విరేచనాలు కావడంతో.. ఏమి తెలియనట్టు తండ్రే కొడుకును చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించాడు. నాగరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో.. మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు అతన్ని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ నాగరాజు గత 31న రాత్రి మృతి చెందాడు. నాగరాజు పెద్దమ్మ మేరీ కుమారి ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్సై వెంకటేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తల్లాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తల్లాడ ఎన్టీఆర్ నగర్ సమీపంలో బైక్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మహిళ ఆదివారం మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రమాదంలో కల్లూరు మండలం పాయపూర్ గ్రామానికి చెందిన గోసు కళావతి(40) మృతిచెందింది. శనివారం కళావతి పాయపూర్ నుంచి ఎన్టీఆర్ నగర్ సమీపంలో పొలంలో కూలి పనికి వచ్చింది. పని ముగించుకొని ఆమె తిరిగి పాయపూర్ వెళ్లేందుకు ఎన్టీఆర్ నగర్ వద్ద ప్రధాన రహదారిపై నిలబడింది. ఈ సమయంలో తల్లాడ నుంచి కల్లూరు వైపు వెళుతున్న బైక్ ఆమెను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కళావతిని చికిత్స నిమిత్తం 108 ద్వారా ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. మృతురాలి కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరవీరుల ఆశయాలను సాధిస్తాం...

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య



అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించిన నాయకులు

కొత్తగూడెంటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాజ మార్పు కోసం అనేక పోరాటాలు నిర్వహించి అసువులు బాసిన అమరవీరుల ఆశయాలను సాధిస్తామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. నేటి యువత ప్రజాపోరాటాల వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యాలయాల్లో అమరవీరుల వర్ధంతి సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల నవంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వందేళ్ల కమ్యునిస్టు విప్లవ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను భవిష్యత్ తరాలకు వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కెచ్చర్ల రంగారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దా భిక్షం, చంద్ర అరుణ, నాయిని రాజు, అమరాకులపుడి రాజు, కల్పన, భాస్కర్, జాటోత్ కృష్ణ, ప్రభాకర్, మధుసుదన్‌రెడ్డి, ధర్మా, గోపాల్‌రావు, సతీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సొగసు చూడతరమా..!

'ఇల్లెందు' కరెంట్ ఆఫీస్ సెంటర్ దుస్థితి..



మెయిన్‌రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలు



కూలిపోయిన కరెంట్ ఆఫీస్ జంక్షన్ సర్కిల్

ఇల్లెందు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలోని కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో ప్రధాన రహదారి, జంక్షన్ సర్కిల్ అధ్వానంగా మారాయి. నిత్యం వందలాది ఇసుక లారీలు, బొగ్గు లారీలు, భారీ వాహనాలు ప్రయాణించే కరెంట్ ఆఫీస్ సెంటర్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. బీటీ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు పడినా ప్రయాణించడంతో భారీ గుంతలు కావడంతో లారీల కమాన్ కట్టలు విరిగిపోతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అదేవిధంగా జంక్షన్ సర్కిల్‌కు భారీ వాహనాలు తగలడం మూలంగా కూలిపోయింది. అవసరానికి మించి జంక్షన్ సర్కిల్‌ను పెద్దగా నిర్మించడంతో వాహనదారులు అగచాట్లకు గురవుతున్నారు. జంక్షన్ సర్కిల్ కూలడం మూలంగా రాళ్లు మట్టి దిబ్బెలు దర్శనమిస్తున్నాయి. కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో ఏర్పడిన గుంతలు, సర్కిల్ ప్రహరీ కూలిపోయి నెలలు గడుస్తున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



కమ్మ సంఘం వనసమారాధనకు కమిటీలు

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కమ్మమహా జనసంఘం ఆధ్వర్యంలో నవంబరు 16న వనసమారాధన నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వనసమారాధకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. నగరంలోని గొల్ల గుడెం రోడ్‌లోని చెరుకూరి తోటలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మలతో పాటు వివిధ పార్టీలలో ఉన్న ముఖ్యనాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. కమ్మ వారిలో ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానిస్తామని చెప్పారు. ఈ వనసమారాధన కార్యక్రమానికి వేలాదిమంది కమ్మవారు కటుంబ సమేతంగా హాజరై విజవంతం చేయాలని కోరారు.

9న టీయూసీఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు

రాష్ట్ర కార్యదర్శి రామయ్య

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్‌యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు డిసెంబరు 9న నేలకొండపల్లిలో జరుగుతాయని సంఘం రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధాన నిర్ణయాలతో రోజుకు రోజుకు కార్మికులు తమ హక్కుల్ని కోల్పోతున్నారని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మిక హక్కుల చట్టాల స్థానంలో అమలు జరుగుతున్న లేబర్ కోడ్‌లపై శిక్షణ తరగతుల్లో చర్చించటంజరుగుతుందన్నారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్ఎల్ పద్మ శిక్షణ తరగతులు ప్రారంభిస్తారని తెలిపారు.

జీఎంకు సన్మానం

సత్తుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన చింతల శ్రీనివాసరావును ఆదివారం లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్తుపల్లిలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఏజీఎంగా పదోన్నతి పొందిన కిష్టారం ఓసీ పీఓ ఎంవీ.నరసింహారావును శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షకార్యదర్శులు రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొలిక్కి రాని ఖాళీ స్థలాల సమస్య

- మురుగు, ప్రమాదకరంగా గుంతలు, బావులు
- ఒకవైపు ప్రమాదాలు మరో వైపు దోమల వ్యాప్తి
- యజమానులను గుర్తించి నోటీసులు ఇవ్వటంలో విఫలం
- గోవును ప్రాణాపాయం నుంచి కాపాడిన డీఆర్ఎఫ్ బలగాలు




మురుగు నీరుతో ఉన్న ఖాళీ స్థలం, ఆవును బయటకు తీస్తున్న డీఆర్ఎఫ్ బలగాలు

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికార యంత్రాంగం ఖమ్మం నగరంలోని మైదాన, విలీన ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల సమస్యలను మాత్రం కొలిక్కి తీసుకరాలేక పోతుంది. ఏడాదికిపైగా నగరంలోని ఖాళీ స్థలాలు సమీపంలోని నివాసాల వారిని అనారోగ్యానికి గురి చేస్తున్నాయి. ఖమ్మం నగరంలో స్థలాలు కొనుగోలు చేసిన వారు తర్వాత వాటిలో నిర్మాణాలు చేపట్టకుండా కనీసం మట్టితో నింపకుండా ఉంచుతున్నారు. ఫలితంగా వాటిలో వర్షానికి మురుగు నీరు చేరి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి.మరోవైపు ఖాళీస్థలాల్లో పెద్ద గోతులు పురాతన బావులు ఉంటున్నాయి. ఖాళీ స్థలాలే కదా అని వాటిలో పశువులు మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు వాటిలో పడి మృత్యువాతకు గురవుతున్నాయి.

నోటీసులు జారీలో వైఫల్యం

ఖాళీస్థలాలు నివాసల మధ్య ఉండటంతో ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా విలీన డివిజన్లలో సమస్య అధికంగా ఉంటుంది. అయితే ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారికి కఠినమైన నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర ప్రజాప్రతినిదుల నుంచి మేయర్ పునుకొల్లు నీరజ వరకు పదే పదే ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ ఆ మేరకు కేఎంసీ ఉద్యోగులు ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులు ఇవ్వటంలో వైఫల్యం చెందుతున్నారు. కొంతమంది ఖాళీ స్థలాల యజమానుల ఫోన్ నెంబర్లు తెలిసిన వారితో స్థలాల్లో మట్టి పోయించలేక పోతున్నారు. దీంతో ఖాళీస్థలాల్లో మురుగు నీరు చేరుతోంది. దీంతో ప్రజలు గగ్గోలు పెట్టి స్థానిక కార్పొరేటర్లతో ఫోన్లు చేయించి వత్తిడి చేయించిన వారికి మాత్రం ఖాళీ స్థలాల్లోని మురుగు నీరును కేఎంసీ ట్యాంకర్లతో బయటకు తోడిస్తున్నారు. వర్షాలు పడిన వెంటనే వర్షాపు నీటితో తిరిగి నిండిపోతున్నాయి. ఇలా ఖాళీస్థలాల్లో నీటిని బయటకు ట్యాంకర్ల ద్వారా తోడటం ద్వారా ఖమ్మం నగర పాలక సంస్థకు ప్రతి నెల రూ.లక్షల జరుగుతుంది, కేఎంసీలో ఎత్తిపోతల పథకంగా మారిందని విమర్శలు వెలువడుతున్నాయి..

పశువులను కాపాడిన డీఆర్ఎఫ్ బలగాలు

కార్తికమాసం వేళ ఖమ్మం డీఆర్ఎఫ్ బలగాలు శభాష్ అనిపించుకున్నాయి. నగరంలోని 26వ డివిజన్‌లో సుగ్గలవారి తోటలో ఖాళీస్థలంలో ఇంటి నిర్మాణానికి సగం పనులు చేసి పిల్లర్లు నిర్మాణాలకు గోతులు తీసి ఉంచారు. ఆదివారం పశువులు మేతకు వెళ్లాయి. ఓఆవు గోతిలో పడింది. సమీపంలోని నివాసంలో ఉన్న మహిళ సీతమ్మ చూసి మేయర్ పునుకొల్లు నీరజకు సమాచారం అందించారు. మేయర్ స్థానిక జవాన్‌కు కంకణాల రాజుకు సమాచారం ఇవ్వటంతో డీఆర్ఎఫ్ బలగాలు పశువును గోతిలోనుంచి బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. ఇలా ఖాళీస్థలాలు ప్రమాదకారకాలుగా మారుతున్నాయి. కొన్నిసందర్భాల్లో మనుషులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు విషసర్పాలు, పురుగులు ప్రజల్ని కాటు వేస్తున్నాయి.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి అన్నారు. ఆదివారం నగరంలోని డీపీఆర్సీ భవన్‌లో జరిగిన పద్మశాలి ఉద్యోగుల ఆత్మీయసమావేశంలో మాట్లాడుతూ పద్మశాలీలు అనేక రంగాల్లో ముందజలో ఉన్నారు కానీ, రాజకీయంగా లేరని, ఆ రంగంలోనూ రాణించాలని పిలుపు నిచ్చారు. అనంతరం పేదపద్మశాలీ విద్యార్థులకు, దివ్యాంగులకు ఈ స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రచ్చా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మోరం మధుకుమార్,జల్లా లక్ష్మీనారాయణ, అంచ నాగరాజు, మోతకూరి జానకిరాములు, ఉదారి గోపాల్‌రావు, బండారు వెంకన్న, అప్పని భాస్కరావు పాల్గొన్నారు.



ఉపకార వేతనం అందజేస్తున్న మురళి

అన్నదాతకు కలిసిరాని కాలం

- మొంథా తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలు




వర్షానికి నీట మునిగిన వరి, వర్షానికి కొట్టుకుపోయిన మిర్చి పంట

ఖమ్మంరూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు అన్నదాతకు కలిసి రాలేదు. పంటలు చేతికొస్తున్న తరుణంలో ముంథా తుపాను కారణంగా ఆర్థికంగా నష్టాల పాలయ్యారు. ఖమ్మంరూరల్ మండలంలో మొత్తం సుమారు36వేలఎకరాల సాగు భూమి ఉంది. అందులో వ్యవసాయానికి అనువైన భూములు 28వేల ఎకరాలు ఉండగా, 4వేల ఎకరాలు బీడుభూములుగా ఉన్నాయి. మరో 4వేలఎకరాల్లో ఎలాంటి పంటలు పండించడం లేదు. ఈఏడాది వానాకాలంలో 8వేల ఎకరాల్లో వరి,పత్తి 13వేల ఎకరాల్లో, మిర్చి 2500 ఎకరాల్లో సాగుచేశారు.మిగిలిన భూముల్లో మొక్క జొన్న, కూరగాయలు సాగు చేశారు.

ప్రారంభం నుంచి వర్షాలు

కాలం ప్రారంభం నుంచి వర్షాలతో రైతులు పోరాటం చేస్తున్నారు.ప్రస్తుతం వరిపంట కోతకు వచ్చింది. పత్తి చేలల్లో కూలీలు పత్తి తీస్తున్నారు. మిర్చి పూత పిందమీద ఉంది. దీంతో కొంతైన చేతికి వస్తుందిలే అని రైతు ఆశతో ఉన్నాడు.ఈక్రమంలో నోటికాడికి వచ్చిన పంటలను ముంథా తుపాను అన్నదాతలకు వెన్నులో వనుకుపుట్టించింది. నోటికాడికివచ్చిన పంటలపై ముంథా రూపంలో పిడుగుపడినట్లయింది. చేతికొచ్చిన పత్తి నీటిపాలైయ్యాయి. కోతకు వచ్చిన వరి మునిగిపోయింది. పూతకొచ్చిన మిర్చి నేలపాలైంది.

తీవ్రంగా దెబ్బతిన్న పంటలు

ఇప్పటివరకు పత్తి పంటలకు ఎకరానికి పెట్టుబడిసుమారు రూ.50వేల వరకు పెట్టారు. వరికి రూ.40వేల వరకు, మిర్చికి రూ.1లక్షవరకు పెట్టుబడి పెట్టారు.అధికవడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేశారు.పెట్టుబడి కూడా రాకుండా పోయింది. వర్షాలకు సుమారు 2వేలఎకరాల్లో వరి, పత్తి సుమారు 5వేల ఎకరాల్లో మిర్చి సుమారు 800ఎకరాల్లో దెబ్బతిన్నది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కేశ్వాపురంలో కార్తీక పూజలు

కూసుమంచి,నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశ్వాపురం గ్రామంలో కార్తీకమాసం పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని శివాలయంలో మహాశివునికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహించారు. మహిళలు దండియా ఆడారు. అనంతరం అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఆదివారం నగరంలోని పలు ఆలయాలలో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వ్రత సామగ్రిని ఆలయం తరుపున భక్తులకు ఉచితంగా అందించామని ఆలయ ఈవో తెలిపారు.

నేడు కార్తీక రెండో సోమవారం

కార్తీక మాసం రెండో సోమవారం కావటంతో జిలల్లాలోని పలు శివాలయాలు భక్తులతో కిటికిటలాడనున్నాయి. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించనున్నారు. కొందరు భక్తులు నదులు, కాలువలు, వాగుల వద్ద దీపాలు వెలిగించి దగ్గరలోని శివాలయాలకు వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

లాటరీ విధానంలో తాటి చెట్ల కేటాయింపు

బోనకల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఆదివారం గీత కార్మిక సంఘం అధ్యక్షుడు కందుల సత్యం ఆధ్వర్యంలో లాటరీ విధానంలో తాటి చెట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా బీసీసెల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందుల పాపారావు మాట్లాడుతూ.. గీతకార్మికులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. రక్షణ కిట్ల పంపిణీతో పాటు గీత కార్మికుల కోసం సంక్షేమ భవనాన్ని కూడ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిద రామారావు, తోట వెంకన్న, బొమ్మగాని సాంబయ్య, కందుల శ్రీను, మంద తిరుపతి, శ్రీను, వేణు, గోపిరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలపై విజిలెన్స్ దాడులు సరికాదు

పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

వైరా, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని అడిగినందుకు కళాశాలలపై విజిలెన్స్ దాడులు చేయించడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ విమర్శించారు. ఆదివారం వైరాలో జరిగిన పీడీఎస్‌యూ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రూ.8150కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.ఈ నిధుల విడుల కోసం విద్యార్థి సంఘాలు చేసిన పోరాట ఫలితంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1200 కోట్లు రెండు దఫాలుగా విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన గడువు కూడా ముగిసిందని, ఆ నిధులను చెల్లించాలని కోరిన కళాశాలలపై ఇప్పుడు విజిలెన్స్ దాడులు చేయడాన్ని ఖండించారు.

విద్యార్థికి సన్మానం

వైరా, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మెడిసిన్‌లో ఉచిత సీటు సాధించిన వైరా మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన ఆదూరి జస్విన్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సన్మానించారు. బీఆర్ఎస్ నాయకుడు ఆదూరి ప్రేమ్‌కుమార్ చిన్నకుమారుడైన జస్విన్ వికారాబాద్‌లోని మహావీర్ మెడికల్ కాలేజీలో ఉచిత మెడిసిన్ సీటు సాధించాడు. జస్విన్‌ను మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు.

జోరుగా మట్టి వ్యాపారం

- తిరుమలాయపాలెంలో ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు



మట్టిని లారీలోకి తరలిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ మట్టి వ్యాపారం జోరుగా సాగుతుంది. ప్రకృతి సంపదను కొల్లగొడుతు అక్రమ సంపాదనకు అలవాటు పడిన అక్రమార్కులు దందా కొనసాగిస్తున్నారు. రాత్రి, పగలు లేకుండా తోలకాలు చేపడుతున్నారు. ఎవరైనా సొంతభూమిలో మట్టితోలకాలకు పాల్పడినా మైనింగ్ అనుమతి తీసుకోవాలని జిల్లా అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా మండలంలో పలు గ్రామాల్లో ఎటువంటి అనుమతిలేకుండాతరలిస్తున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మండలలో పలు గ్రామాల్లో బీటీ రోడ్లు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్లు రాజకీయ పలుకుబడితో ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతూ రోడ్డునిర్మాణానికి మట్టి తరలిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకేనని సమాధానం చెబుతున్నారు. తిరుమలాయపాలెం గ్రామంలోని రమణతండా వెళ్లే రహదారిలో ఆర్అండ్‌బీ రోడ్డు 94,98 సర్వేనెంబర్లలోని ప్రైవేటు భూమిలో ఎటువంటి అనుమతిలేకుండానే నిత్యంరోడ్లపేరుతో మట్టిని తరలిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అనుమతులున్నాయని బుకాయిస్తూ అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. బచ్చోడు,జూపెడ, హస్నాబాదు, మాదిరిపురం, పిండిప్రోలుప్రాంతాల్లో మట్టితవ్వకాలు యథేచ్ఛగా జరుపుతున్నారు. ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

బాంబుల మోత

తిరుమలాయపాలెంలో సమీపంలోని రమణ తండా వైపు వెళ్లే రహదారిలో గుట్టలు ఎటువంటి అనుమతి లేకుండా బాంబుబ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. దీంతో ఆయాప్రాంతాల రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అటు వెళ్లాలంటే ప్రాణాలు చేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పామాయిల్ తోట పక్కన ఓ వ్యక్తి పక్కనే ఉన్న గుట్టకు ఎటువంటి అనుమతిలేకుండా బ్లాస్టింగ్ పనులు చేస్తున్నాడు.

తరతరాలను ప్రభావితం చేసిన వంగవీటి

సత్తుపల్లిలోవంగవీటి విగ్రహావిష్కరణ



సత్తుపల్లిలో వంగవీటి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ

సత్తుపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేవలం మూడున్నరేళ్ల పాటు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించిన వంగవీటి మోహన్‌రంగా తరతరాలను ప్రభావితం చేశారని ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. సత్తుపల్లిలో మున్నూరు కాపు సంఘం, వంగవీటి మోహన్‌రంగా (వీఎంఆర్) యూత్ సంయుక్త ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట నూతనంగా ఏర్పాటుచేసిన 7అడుగుల వంగవీటి మోహన్‌రంగా కాంస్య విగ్రహాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ప్రాంతం ఏదైనా కులమతాలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరించిన వారిని ఎప్పుడూ గుర్తుంచుకుంటారని వంగవీటి నిరూపించారన్నారు. మూడున్నర దశాబ్ధాల తర్వాత కూడా ఆయనమీద అభిమానం చాటిచెబుతున్నారంటే రంగా ప్రజల గుండెల్లో ఏ స్థాయిలో అభిమానం సంపాదించుకున్నారో అర్థమవుతోందన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆశాజ్యోతి, బడుగు, బలహీనవర్గాల పెన్నిధి అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో గొప్పవ్యక్తిగా రాణించి పేద ప్రజల హృదయాల్లో నిలిచిన మంచి వ్యక్తి అని, ఆయన సేవలను గుర్తుంచుకునేలా చేసిన కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాపుసంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు కొండా దేవయ్యపటేల్, పారా నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, నాయకులు జల్లిపల్లి వెంకటేశ్వర్లు, శెట్టి రంగారావు, దేవేందర్, గోవిందు శ్రీనివాస్, నర్సయ్య, మంజుల, గుంటుపల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఓటమి భయంతోనే దాడులు

మాజీ ఎమ్మెల్యే సండ్ర



మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మంమార్కెట్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే కాంగ్రెస్ ఇతర పార్టీల మీద దాడులకు దిగుతుందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మణుగూరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ చేసిన దాడి సరైనదికాదన్నారు.తమ కార్యాలయానికి ఇందిరమ్మ భవన్ అని పేరు పెట్టడం సమంజసం కాదన్నారు.

దాడి హేయమైన చర్య

కామేపల్లి: మణుగురులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్యఅని బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లెంపాటి శ్రీనివాసరావు అన్నారు. కామేపల్లిలో మండల మాజీఅధ్యక్షుడు అంతోటి అచ్చయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా మద్దతు లేకనే దాడులు చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సామా మోహన్‌రెడ్డి, వడియాల క్రిష్ణారెడ్డి,భట్టు శంకర్, మూడ్ క్రిష్ణప్రసాద్, అజ్మీరా రాజు, జర్పల భగవాన్, రాయల చిన్నవెంకటేశ్వర్లు, కన్నమాల రాంబాబు, ఆదూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఖమ్మంనగరంలోని చెరవుబజార్ నుంచి మమతా ఆసుపత్రి వైపు వెళ్లే రహదారి మరమ్మతులు చేస్తున్నారు. కల్వర్టు ముందుభాగంలో మొరం పోశారు. కానీ ఆ మొరం ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకు పోయింది. ప్రమాదకరంగా మారింది.కల్వర్టు నుంచి ఏమాత్రం పక్కకు జారినా ద్విచక్ర వాహనదారులు పక్కనే ఉన్న కాలవలో పడిపోయే ప్రమాదం ఉంది. రాత్రిపూట ప్రయాణించాలంటే వాహనదారులు, పాదాచరులు భయపడుతున్నారు.

ఫొటోలు: ఆంధ్రజ్యోతి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ ఖమ్మం

వైరాకు ఏసీపీ అవసరం లేదా..?

- నెలరోజులుగా ఇన్‌చార్జ్ ఏసీపీనే

వైరా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇలాకా పరిధిలోని వైరా అసిస్టెంట్ పోలీస్ కమిషనర్(ఏసీపీ) పోస్టు నెలరోజుల నుంచి ఖాళీగా ఉంది. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలోని రెండు పోలీస్ సర్కిళ్లు, ఎనిమిది పోలీస్‌స్టేషన్లతో ఉన్న వైరా ఏసీపీ పోస్టును నెలరోజుల నుంచి భర్తీ చేయడం లేదు. కల్లూరు ఏసీపీ రఘు ఇన్‌చార్జ్ ఏసీపీగా నెలరోజుల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. గడచిన మూడేళ్ల నుంచి వైరా ఏసీపీగా పనిచేసిన ఎంఏ.రెహ్మాన్ సెప్టెంబరు 30న ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇంతవరకు ఏసీపీగా ఎవరిని నియమించలేదు. వైరా పోలీస్ సర్కిల్ పరిధిలోవైరా,కొణిజర్ల(వైరానియోజకవర్గం), చింతకాని(మధిర నియోజకవర్గం),తల్లాడ(సత్తుపల్లినియోజకవర్గం) పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇకపోతే మధిర సర్కిల్ పరిధిలో బోనకల్, మధిర టౌన్, మధిర రూరల్, ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వైరా ఏసీపీ పరిధిలో ఉన్న ఎనిమిది పోలీస్‌స్టేషన్లలో ఐదు పోలీస్‌స్టేషన్లు మధిర నియోజకవర్గానికి చెందినవే. మిగిలిన మూడు పోలీస్‌స్టేషన్లు వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి.

సమస్యాత్మకంగా చింతకాని..

వైరా ఏసీపీ పరిధిలో ఎక్కువగా చింతకాని మండలం అత్యంత సమస్యాత్మకమైనది. ఇక్కడ శాంతిభద్రతల పరిరక్షణ పోలీసులకు కత్తి మీద సాములా ఉంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిథ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గం పరిధిలో చింతకాని ఉంది. శుక్రవారం చింతకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతర్లపాడులో మాజీ సర్పంచ్, సీపీఎం రాష్ట్ర నేత సామినేని రామారావు అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. డిప్యూటీ సీఎం ఈ హత్యను తీవ్రంగా ఖండించారు. దాదాపు ఏడాది కిందట పొద్దుటూరులో చేపల చెరువు వివాదంలో అప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ అయిన పెంట్యాల పుల్లయ్యను పోలీసులు సినీఫక్కీలో అరెస్టు చేసి రిమాండ్ చేసిన వ్యవహారం చర్చనీయాంశమైంది. అయితే కారణాలు ఏమైనప్పటికీ పుల్లయ్య ఇటీవల కాలంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు.



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE

సోమవారం 3 నవంబరు 2025

వైరా-మధిర

సత్తుపల్లి

8

WYRA, MADHIRA, SATHUPALLY

మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



వైరా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెడిసిన్‌లో ఉచిత సీటు సాధించిన వైరా మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన ఆదూరి జస్విన్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సన్మానించారు. బీఆర్ఎస్ నాయకుడు ఆదూరి ప్రేమ్ కుమార్ చిన్నకుమారుడైన జస్విన్ వికారాబాద్‌లోని మహావీర్ మెడికల్ కాలేజీలో ఉచిత మెడిసిన్ సీటు సాధించాడు. జస్విన్‌ను మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, మాదినేని దుర్గాప్రసాద్, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, తడికమళ్ల నాగేశ్వరరావు, అప్పం సురేష్, వల్లెపు రాము పాల్గొన్నారు.

కళాశాలలపై విజిలెన్స్ దాడులు సరికాదు



మాట్లాడుతున్న గోకినపల్లి మస్తాన్

వైరా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని అడిగినందుకు కళాశాలలపై విజిలెన్స్ దాడులు చేయించడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ విమర్శించారు. ఆదివారం వైరాలో జరిగిన పీడీఎస్‌యూ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.8150కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.ఈ నిధుల విడుదల కోసం విద్యార్థి సంఘాలు చేసిన పోరాట ఫలితంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1200కోట్లు రెండు దఫాలుగా విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన గడువు కూడా ముగిసిందని, ఆ నిధులను చెల్లించాలని కోరిన కళాశాలలపై ఇప్పుడు విజిలెన్స్ దాడులు చేయడాన్ని ఖండించారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై మాత్రమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అజయ్, ఉదయ్‌భాస్కర్, కృష్ణ భాస్కర్, జ్యాయల్, అబిన్, మహేష్‌సాగర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ట్రస్టు వైద్య శిబిరం విజయవంతం



మందులు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

బోనకల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. హై బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు టి.పవన్ కుమార్, కిరణ్ కుమార్‌లు మాట్లాడుతూ.. ఒత్తిడిని జయించడం ద్వార ఆరోగ్యాభివృద్ధి చేకూరుతుందన్నారు. చలికాలంలో ఎక్కువగా గుండెనొప్పి వచ్చే ముప్పు ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని కోరారు. ప్రతి ఏడాది ఈసీజీ, 2డీ ఇకో, టీఎంటీ, లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బత్తినేని ట్రస్టు సభ్యుడు తూము రోషన్ కుమార్, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, బొమ్మినేని కొండలరావు, ఏలూరి పూర్ణచందర్‌రావు, మాతంగి శ్రీనివాసరావు, ఆకేన పవన్, షేక్ నజీర్ పాల్గొన్నారు.

సైబర్ ఉచ్చులో సామాన్యులు

- మధిరలో పెరుగుతున్న సైబర్ నేరాలు
- వ్యాపారులు, చదువుకున్న వారు సైతం మోసాలకు బలి
- ఇటీవల మెసేజ్ క్లిక్ చేసి 9.90 లక్షలు పోగొట్టుకున్న ఓ వ్యాపారి
- మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో గత నెలలోనే24 కేసులు

మధిర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో మధిర పట్టణంలో సైబర్ కేటుగాళ్ల ఆగడాలకు పలువురు తమ జేబులు గుల్ల చేసుకున్నారు. సైబర్ కేటుగాళ్ల కన్ను పట్టణ ప్రాంతాల వారిపైనే కాకుండా గ్రామీణ ప్రాంతాల వారిపై కూడా పడింది ముఖ్యంగా మధిర పట్టణంలో తరచూ అనేక మందికి సైబర్ కేటుగాళ్లు యప్‌ల ద్వారా, లింక్‌ల ద్వారా, ఫోన్ కాల్ ద్వారా తమ ఉచ్చులోకి లాక్కునేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు వీటికి బలి అవుతుండగా మరి కొందరు తెలివిగా తిప్పికొడుతున్నారు. ఈ మధ్య కాలంలో ప్రముఖంగా సైబర్ మోసాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇటీవల మధిర పట్టణంలోని ఓ మొబైల్ దుకాణంలో ఓ వ్యక్తి వచ్చి కొత్త ఫోన్ కొని ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించి ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ అనే మెసేజ్ చూపించి చిన్నగా జారుకోబోయాడు తీర దుకాణదారుడు తన అకౌంట్ చూస్తే డబ్బులు జమ కాలేదు కాగా కొనుగోలు దారుని ఫోన్ చెక్ చేయగా అతడు నకిలీ ఫోన్‌పే వాడుతున్నట్లు తెలుసుకుని నిలదీయడంతో చివరకు డబ్బులు చెల్లించి జారుకున్నాడు. అలాగే ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా సైబర్ కేటుగాడు ఫోన్ చేసి సదరు ఉపాధ్యాయుడి కుమారుడు అమెరికాలో డ్రగ్స్ కేసులో ఇరుకున్నాడు అని చెప్పి ఫోన్‌లో కుమారుడి ఏడుపులు వినిపిస్తూ, పోలీస్ సైరన్ మోతలతో కంగారు పెట్టాడు. ఈ కేసు నుంచి విముక్తి చేయాలంటే అర్జెంటుగా లక్ష రూపాయలు ఫోన్‌పే ద్వారా చెల్లించాలని చెప్పడంతో కుమారుడు ఆపదలో చిక్కు కున్నాడు అనే కంగారులో లక్ష ఫోన్‌పే చేశాడు. తరువాత కొడుకుకి ఫోన్ చేయగా తాను ఇంట్లోనే ఉన్నానని తెలపడంతో తాను సైబర్ మోసానికి గురయ్యానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా పట్టణ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన రైతు కుమారుడు అమెరికాలో ఉన్న కొడుకు డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నాడు అర్జెంటుగా లక్ష ఫోన్‌పే చేయాలని ఆగంతకుడు కోరడంతో ఫోన్‌పే ఉపయోగించడం తెలియన రైతు కంగారులో పక్కనే ఉన్న యువకుడి దగ్గరకి పరిగెత్తుకుని వెళ్లి విషయం చెప్పి లక్ష ఫోన్‌పే చేయమని కోరగా ఆ యువకుడు ఇది ఫేక్ కాల్ ఇటువంటి వాటిని నమ్మవద్దు అని వెంటనే అతని కుమారుడికి ఫోన్ చేయగా తాను క్షేమంగా ఉన్నట్లు తెలిపాడు. మధిర పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి మూడు రోజుల క్రితం ఒక మెసేజ్ రాగా దానిని క్లిక్ చేయడంతో తన అకౌంట్ నుంచి సైబర్ మోసగాడు 9.90 లక్షలు కాజేశాడు. అలాగే నిధానపురంలో ఓ కిరాణ షాపు యజమాని రూ.26 వేలు, రాయపట్నం గ్రామానికి చెందిన ఓ నిరుద్యోగ యువకుడికి ఇంటి నుంచే ఉద్యోగం చేసుకోవచ్చు అని రూ.5లక్షలు, ఆర్.వి కాంప్లెక్స్ వద్ద ఓ వ్యాపారిని ఇన్వెస్ట్ చేయమని చెప్పి రూ.7లక్షలు, మరో వ్యక్తికి బ్యాంక్ పేరుతో లింక్ రాగా ఓపెన్ చేయగా రూ.70 వేలు పోగొట్టుకుని మధిర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు, ఇలా ఒక్క అక్టోబరులోనే మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో 24 కేసులు నమోదు అయ్యాయంటే సైబర్ కేటుగాళ్లు ఏ విధంగా నేరాలకు పాల్పడుతున్నారో అర్థమవుతోంది.



అవగాహన కలిగి ఉండాలి..
రమేష్, మధిర టౌన్, సీఐ

ముఖ్యంగా స్మార్ట్ ఫోన్ వాడే వారు చాలా జాగ్రత్తగా ఉండాలి ఇటీవల కాలంలో ముందెన్నడు లేని విధంగా అనేక మంది సైబర్ మోసగాళ్లకు బలి అయిన తరువాత తెలుసుకుంటున్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి అలాగే స్మార్ట్ ఫోన్ లో వచ్చే మెసేజ్‌లు, లింకుల పై అవగాహన కలిగి ఉండాలి. తమ స్మార్ట్ ఫోన్‌కి వచ్చే బ్యాంక్ లోగోతో ఉండే ఏపీకే ఫైల్స్‌పై ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు అలా చేస్తే వెంటనే సదరు వ్యక్తి ఫోన్‌లోని డేటా అంతా సైబర్ మోసగాడి ఆధీనంలోకి పోతుంది. ఫోన్‌పేకు రిజిస్టర్ అయిన ఖాతాలోని డబ్బు, ఇతర సమాచారం మొత్తం పాస్‌వర్డ్‌లతో సహా సైబర్ నేరగాళ్లు తెలుసుకుంటారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని, ఆన్‌లైన్ లో జాబ్ కోసం ముందు డిపాజిట్లు చెల్లించమని, బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాం ఓటీపీ చెప్పమని ఫోన్ చేస్తారు ఇటువంటి వాటిని నమ్మకండి. సైబర్ మోసానికి గురైన వారు వెంటనే ఫిర్యాదు చేస్తే నిందితుడి ఖాతాలో డబ్బుని ఫ్రీజ్ చేయవచ్చు, ఆ నగదును కోర్టు ద్వారా తిరిగి పొందవచ్చు.

వైరాకు ఏసీపీ అవసరం లేదా..?

- నెలరోజులుగా ఇన్‌చార్జ్ ఏసీపీనే



వైరాలోని ఏసీపీ కార్యాలయం

వైరా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇలాకా పరిధిలోని వైరా అసిస్టెంట్ పోలీస్ కమిషనర్(ఏసీపీ) పోస్టు నెలరోజుల నుంచి ఖాళీగా ఉంది. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలోని రెండు పోలీస్ సర్కిళ్లు, ఎనిమిది పోలీస్‌స్టేషన్లతో ఉన్న వైరా ఏసీపీ పోస్టును నెలరోజుల నుంచి భర్తీ చేయడం లేదు. కల్లూరు ఏసీపీ రఘు ఇన్‌చార్జ్ ఏసీపీగా నెలరోజుల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. గడచిన మూడేళ్ల నుంచి వైరా ఏసీపీగా పనిచేసిన ఎంఏ.రెహ్మాన్ సెప్టెంబరు 30వతేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇంతవరకు ఏసీపీగా ఎవరిని నియమించలేదు. వైరా పోలీస్ సర్కిల్ పరిధిలో వైరా, కొణిజర్ల(వైరా నియోజకవర్గం), చింతకాని(మధిర నియోజకవర్గం), తల్లాడ(సత్తుపల్లి నియోజకవర్గం) పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇకపోతే మధిర సర్కిల్ పరిధిలో బోనకల్, మధిర టౌన్, మధిర రూరల్, ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వైరా ఏసీపీ పరిధిలో ఉన్న ఎనిమిది పోలీస్‌స్టేషన్లలో ఐదు పోలీస్‌స్టేషన్లు మధిర నియోజకవర్గానికి చెందినవే. మిగిలిన మూడు పోలీస్‌స్టేషన్లు వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి.

సమస్యాత్మకంగా చింతకాని..

వైరా ఏసీపీ పరిధిలో ఎక్కువగా చింతకాని మండలం అత్యంత సమస్యాత్మకమైనది. ఇక్కడ శాంతిభద్రతల పరిరక్షణ పోలీసులకు కత్తి మీద సాములా ఉంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గం పరిధిలో చింతకాని ఉంది. శుక్రవారం చింతకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతర్లపాడులో మాజీ సర్పంచ్, సీపీఎం రాష్ట్ర నేత సామినేని రామారావు తన ఇంట్లోనే దుండగుల చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. డిప్యూటీ సీఎం ఈ హత్యను తీవ్రంగా ఖండించారు. హంతకులు ఎంతటివారైనా వెంటనే పట్టుకోవాలని ఆదేశించారు. దాంతో ఖమ్మం సీపీ సునీల్‌దత్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఏసీపీ రఘు, సబ్‌డివిజన్ పోలీసులు పాతర్లపాడులో బందోబస్తు ఏర్పాటుచేశారు. దాదాపు ఏడాది కిందట పొద్దుటూరులో చేపల చెరువు వివాదంలో అప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ అయిన పెంట్యాల పుల్లయ్యను పోలీసులు సిసీపక్కీలో అరెస్టు చేసి రిమాండ్ చేసిన వ్యవహారం చర్చనీయాంశమైంది. అయితే కారణాలు ఏమైనప్పటికీ పుల్లయ్య ఇటీవల కాలంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. భట్టి విక్రమార్క సీఎల్పీ నేతగా ఉన్న సమయంలో ఇదే మండలానికి చెందిన ఒక దళిత మహిళ ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో విచారణ సమయంలో మృతిచెందిన వ్యవహారం రాష్ట్రంలోనే పెను సంచలనమైంది. ఆసమయంలో వైరా ఏసీపీగా ఉన్న సత్యనారాయణ, అప్పటి మహిళా ఎస్ఐ పనితీరుపై తీవ్ర విమర్శలు రావడం ఆతర్వాత వారిపై పోలీసు అధికారులు వేటు వేయడం జరిగింది. ఈవిధంగా చింతకాని పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి.

వైరా కోసం పోటీపడుతున్న ఏసీపీలు..

వైరా ఏసీపీగా ఈ ఏడాది మేలో డీజీపీ కార్యాలయంలో ఉన్న సారంగపాణిని డిప్యూటేషన్‌పై నియమించారు. మధిర మండలానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి మేరకు భట్టి విక్రమార్క సారంగపాణి రాకకు అప్పట్లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పోలీస్ వర్గాల్లో చర్చ జరిగింది. ఆసమయంలో వైరా ఏసీపీగా ఉన్న రెహ్మాన్ వెంటనే కొంతమంది కాంగ్రెస్ నేతల ద్వారా భట్టి విక్రమార్కను ఆశ్రయించి తన ఉద్యోగ విరమణకు కేవలం ఐదునెలలు మాత్రమే ఉన్నందున అప్పటి వరకు తనను కొనసాగించాలని చేసిన విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారు. దాంతో సారంగపాణి రాక నిల్చిపోయింది. గతనెల 30న రెహ్మాన్ ఉద్యోగ విరమణ చేసినప్పటికీ సారంగపాణి మాత్రం రాలేదు. వివిధశాఖల్లో ఏసీపీలుగా ఉన్న మల్లయ్యస్వామి, వెంకన్న వైరా వస్తారని చర్చ జరుగుతుంది. ఇదే సమయంలో ఖమ్మంజిల్లాలోని ఒక సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి సతీమణి కొద్దిరోజుల కిందటే ఐపీఎస్ శిక్షణ పూర్తిచేసుకున్నారని, ఆమె వైరా ఏసీపీగా రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఎంతో కీలకమైన ఖాళీగా ఉన్న వైరా ఏసీపీ పోస్టును భర్తీ చేసేందుకు డిప్యూటీ సీఎం చొరవ తీసుకోవాలని సబ్‌డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

'ఆర్య వైశ్య' ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన



వన సమారాధనలో పూజలు చేస్తున్న దంపతులు

బోనకల్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): బోనకల్ దర్గా వద్ద గల మామిడి తోటలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించి, తీర్ధ ప్రసాదాలను పంపిణీ చేశారు. సామూహిక వన భోజనాలు చేసి, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి సీతారామచందర్, బోనకల్, చింతకాని మండల అధ్యక్షులు చేడే వెంకటేశ్వరరావు, నాగుబండి వెంకట నారాయణ, ఏఎంసీ డైరెక్టర్ అనుమోలు వెంకటేష్, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తెనే వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు చెన్నా సుదీర్, చెన్నా బాను, తెల్లాకుల శ్రీను, కలవల బాబు, రంగా జనార్ధన్, బచ్చు వెంకటేశ్వర్లు, మిరియాల రవి, వెచ్చా సీతారాములు, సుగ్గుల బ్రహ్మం, నాగేశ్వరరావు, కటకం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల ప్రమేయం లేకుండా ధాన్యం సేకరణ

- ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తల్లాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీలర్ల ప్రమేయం లేకుండా కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆన్‌లైన్ ద్వారా నగదును నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆదివారం తల్లాడ మండలం నూతన్‌కల్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగల కేంద్రాన్ని ఆమె ప్రారంరబించారు. ఈసందర్భంగా సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. రైతు సోదరులు ధాన్యాన్ని అమ్ముకునే విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందేందుకు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అమ్మి లాభాలు పొందాలని కోరారు. ధాన్యం సన్నరకం క్వింటాకు రూ.2389, దొడ్డురకం క్వింటాకు రూ.2368లు కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. ధాన్యం17శాతంలోపు తేమ ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ బోళ్ల రంగారావు, వైస్‌చైర్మన్ కాపా సుధాకర్‌లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ బోళ్ల రంగారావు, వైస్‌చైర్మన్ కాపా సుధాకర్, సొసైటీచైర్మన్ తూము వీరభద్రరావు, ఏవో ఎండీ తాజుద్దీన్, సొసైటీ కార్యదర్శి మురళీకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి,మాజీ సర్పంచ్‌లు కొమ్మినేని ప్రభాకరరావు, పోట్రు శరత్‌బాబు , గణేషుల రవి పాల్గొన్నారు.

సమాన విద్య, సమాజ స్థాపనకు ఉద్యమిద్దాం



సత్తుపల్లిరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాన విద్య, సమాన సమాజ స్థాపనకై ఉద్యమిద్దామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఈనెల 4న సత్తుపల్లిలో నిర్వహించే పీడీఎస్‌యూ 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో సమావేశం నిర్వహించారు. గత బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ పాలనలో విద్యారంగం మరింత దెబ్బతిన్నదని విమర్శించారు. పేద విద్యార్థులకు ఆసరాగా నిలిచిన ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలో నిర్లక్ష్యం కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంకటేష్, నవీన్, ఈశ్వర్, సాదిక్‌పాషా, ఫారీద్, చెన్నకేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా క్రైస్తవ సమాధుల పండుగ

కల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం క్రైసవులు సమాధుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సమాధుల స్థలాల్లో మత గురువులు వినయ్, తోమాస్‌లు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మరణం ఇక వరమేనని, మరణం తర్వాత దేవుడు మనకు తీర్పు నిస్తాడని అన్నారు. ఇహలోక జీవితంలో మనం చేసిన క్రియలను బట్టి మనకు ప్రతిఫలము దేవుడు ఇస్తాడని వారు హితవు చెప్పారు. అన్ని జన్మలలో మానవ జన్మ ఉన్నతమైనదని అన్నారు. ఎన్ని కష్టాలు, బాధలు అనిపించిన మరణం తప్పడం లేదని ప్రతి మనిషి ఆవేదన చేందుతుంటాడన్నారు. స్వర్గ ప్రాప్తి పొందిన బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల కోసం క్రైస్తవులు సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కన్యాస్త్రీలు, ఉపదేశకులు, సంఘ పెద్దలు, దళ సభ్యులు పాల్గొన్నారు.

జీఎం శ్రీనివాసరావును సన్మానించిన లారీ అసోసియేషన్ సభ్యులు



సత్తుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన చింతల శ్రీనివాసరావును ఆదివారం లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్తుపల్లిలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఏజీఎంగా పదోన్నతి పొందిన కిష్టారం ఓసీ పీఓ ఎంవీ.నరసింహారావును శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష,కార్యదర్శులు రావి నాగేశ్వరరావు, కొండపల్లి రమేష్‌రెడ్డి, కోశాధికారి ఎస్‌కే.మౌలాలీ, గౌరవాధ్యక్షుడు కే.మోహన్ రావు, సభ్యులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో వంగవీటి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ

తరతరాలను ప్రభావితం చేసిన వంగవీటి

- సత్తుపల్లి వంగవీటి కాంస్య విగ్రహావిష్కరణ..

సత్తుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేవలం మూడున్నరేళ్ల పాటు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించిన వంగవీటి మోహన్‌రంగా తరతరాలను ప్రభావితం చేశారని ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. సత్తుపల్లిలో మున్నూరు కాపు సంఘం, వంగవీటి మోహన్‌రంగా (వీఎంఆర్) యూత్ సంయుక్త ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట నూతనంగా ఏర్పాటుచేసిన 7అడుగుల వంగవీటి మోహన్‌రంగా కాంస్య విగ్రహాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ప్రాంతం ఏదైనా కులమతాలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరించిన వారిని ఎప్పుడూ గుర్తుంచుకుంటారని వంగవీటి నిరూపించారన్నారు. మూడున్నర దశాబ్దాల తర్వాత కూడా ఆయనమీద అభిమానం చాటిచెబుతున్నారంటే రంగా ప్రజల గుండెల్లో ఏ స్థాయిలో అభిమానం సంపాదించుకున్నారో అర్థమవుతోందని, ఆయనను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తు తరాలు కూడా సరైన నాయకత్వంతో ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆశాజ్యోతి, బడుగు, బలహీనవర్గాల పెన్నిధి అని నిరూపించుకున్న వ్యక్తి వంగవీటి అని, ఎప్పుడు పుట్టాం.. పోయామన్నది కాకుండా ప్రజలకు ఎంత మేలు చేశాము, ఎంతమంది గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయామన్నదే ముఖ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో గొప్పవ్యక్తిగా రాణించి పేద ప్రజల హృదయాల్లో నిలిచిన మంచి వ్యక్తి అని, ఆయన సేవలను గుర్తుంచుకునేలా చేసిన కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాపుసంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు కొండా దేవయ్యపటేల్, పారా నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, నాయకులు జల్లిపల్లి వెంకటేశ్వర్లు, శెట్టి రంగారావు, దేవేందర్, గోవిందు శ్రీనివాస్, నర్సయ్య, మంజుల, గుంటుపల్లి శ్రీదేవి పాల్గొన్నారు.



లాటరీ విధానంలో తాటి చెట్ల కేటాయింపు

బోనకల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఆదివారం గీత కార్మిక సంఘం అధ్యక్షుడు కందుల సత్యం ఆధ్వర్యంలో లాటరీ విదానంలో తాటి చెట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా బీసీసెల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందుల పాపారావు మాట్లాడుతూ.. గీత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. రక్షణ కిట్ల పంపిణీతో పాటు గీత కార్మికుల కోసం సంక్షేమ భవనాన్ని కూడ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిద రామారావు, తోట వెంకన్న, బొమ్మగాని సాంబయ్య, కందుల శ్రీను, మంద తిరుపతి, శ్రీను, వేణు, గోపిరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ఏర్పాటుకు గ్రామస్థుల వేడుకోలు

కారేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజులతండాలో వీధులు బురదతో నిండిపోయి నడిచేందకు ఇబ్బందిగా ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. వర్షం కురిస్తే వీధుల్లోకి వచ్చే పరిస్థితి కూడా లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గుట్ట కింద గుంపు పంచాయతీ పరిధిలో ఉన్న గాజులతండాను పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని తెలిపారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చోరవతీసుకుని గ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మునిసిపాలిటీలో వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలి

వైరా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పోరాట ఫలితంగా వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి మంజూరైన రూ.15కోట్ల నిధులతో వెంటనే పనులు ప్రారంభించాలని ఆపార్టీ డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివారం మాడపాటి మల్లికార్జున్‌రావు అధ్యక్షతన జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించాలని కోరారు. మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పూర్తిస్థాయిలో సైడ్‌డ్రెయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు గుడిమెట్ల మోహన్‌రావు, మాడపాటి వెంకటేశ్వరరావు, సుజాత, మోదుగు రాణి, సామినేని నర్సింహారావు, భూక్యా విజయ పాల్గొన్నారు.

ఘనంగా మంగళ కైశిక ద్వాదశి మహోత్సవం

కల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో తిరుమల తిరుపతి దేవస్థానం, దాసుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మంగళ కైశిక ద్వాదశి మహోత్సవం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. మనగుడి కార్యాక్రమలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాసుల సామాజిక వర్గం భక్తులు తరలి వచ్చి ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంమలో మాల దాసుల సంక్షేమ సంఘం తెలంగాణ అధ్యక్షురాలు నంబూరి కనకదుర్గ, అతిథులుగా ఆర్యవైశ్య మహా సభ సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, బిఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు కల్లూరు మండల దాసుల సంఘం అధ్యక్షుడు గుంటక మోహన్‌దాసు, సంఘ నాయకులు గుంటక శ్రీనివాసదాసు, చింతల పూడి కృష్ణ, గుంటక ఉపేంద్ర, మహిళ భక్తులు, పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పికి గాయాలు



సత్తుపల్లిరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో చుక్కల దుప్పికి గాయాలైన సంఘటన సత్తుపల్లిలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎఫ్ఎస్ఓ నరసింహారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక వేంసూర్ రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఓ బస్ ఢీకొనడంతో తీవ్రగాయాలవ్వగా సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు దానికి ప్రథమ చికిత్స అందించారు. స్థానిక నీలాద్రి అర్బన్ పార్క్‌లో వదిలేయగా పార్క్ నుంచి చుక్కల దుప్పి వచ్చినట్లుగా స్థానికులు చెబుతున్నారు. దుప్పి మరణించినట్లు సమాచారం


పుట్టెడు దుఃఖంలో అన్నదాతలు



తుఫాన్‌తో దెబ్బతిన్న పత్తిపంట

ఏన్కూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షాలు, తుఫాన్ల కారణంగా అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. ఏ రైతును కదిలించినా కన్నీళ్లే. కడు దయనీయస్థితిలో ఉన్న తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. గతేడాది మిర్చి ఈ ఏడాది పత్తిపంటతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. గతేడాది మిర్చిపంటకు తెగుళ్ల తోపాటు పంటక ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది పత్తి పంట వేసి సాగుచేయగా పత్తిపంట వర్షార్పణం అయింది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు ఈ ఏడాది మండలంలో సుమారు 12వేల ఎకరాల్లో త్తి, 4500 ఎకరాల్లో మిర్చి, 4వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. పత్తిపంటకు ఎకరానికి రూ.30వేల నుంచి 40వేల వరకు పెట్టుబడి పెట్టారు. పత్తిపంట పూర్తిగా దెబ్బతినడంతో రైతు సుమారు లక్షనుంచి 7లక్షల వరకు నష్టపోయినట్టు అంచనా. అదేవిధంగా మిర్చిపంటకు ఇప్పటి వరకు సుమారు రూ.50వేలు పెట్టుబడిపెట్టారు. అధికవర్షాలతో తోటలు ఎదుగుదల లేక నీరుచిచ్చు, గుబ్బరోగం సోకింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



వేముల రమేష్, రైతు ఏన్కూరు

గత రెండేళ్ల నుంచి నష్టపోతున్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. గతేడాది 12 ఎకరాలలో మిర్చిసాగు చేయగా రూ.8క్షల నష్టం వచ్చింది. ఈ ఏడాది 13 ఎకరాలలో పత్తిసాగుచేయగా పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. సుమారు రూ.6లక్షల నష్టం వచ్చింది. ఆరు ఎకరాల్లో పెసర వేయగా అది కూడా దుయ్యకుండా పోయింది రూ.లక్షా 20వేల నష్టం వచ్చింది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

లక్ష రూపాయల నష్టం



అమరనేని రమేష్, రైతు ఏన్కూరు

మూడు ఎకరాల్లో పత్తి సాగుచేశా. పత్తి పంటపూర్తిగా దెబ్బతిన్నది. సుమారురూ.లక్ష పెట్టుబడి పెట్టా. పంట చేను కాపుల కోసం ఆరునెలల నుంచి రాత్రింబవళ్లు కాపల ఉంటున్నాను. పంట చేతికి రాకపోవడంతో అన్ని విధాలా నష్టపోయను ప్రభుత్వమే ఆదుకోవాలి.